

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ది తెలుగు దినపత్రిక


అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 301 గురువారం, నవంబర్ 19 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

గోడలకే పరిమితమైన ఫార్మసిస్టుల సర్టిఫికెట్లు!

- అర్హతలేని చేతుల్లో ఔషధ విక్రయాలు.. రోగుల భద్రత గాలికి!
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు, ఇంజక్షన్ల విక్రయం
- మెడికల్ షాపులపై తనిఖీలు ఏవీ? అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి

ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన మందులే ప్రమాదకరంగా మారుతున్నాయా? సూర్యాపేట జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల నిర్వహణ తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు ఈ ప్రశ్నకు తావిస్తున్నాయి. ఫార్మసీ అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల పర్యవేక్షణలోనే మందుల విక్రయాలు జరగాల్సి ఉండగా, అర్హత లేని వ్యక్తులు కౌంటర్ల వద్ద కూర్చొని మందులు విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస విద్యార్హత లేని వారు సైతం మందుల పంపిణీ చేపడుతున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు వైద్యుల చీటీ లేకుండానే కొన్ని రకాల మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

సర్టిఫికెట్లు గోడలపై.. విక్రయాలు ఇతరుల చేతుల్లో!

మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసే సాధారణ ప్రజలు వాటిని విక్రయిస్తున్న వ్యక్తికి ఫార్మసీ అర్హత ఉందో లేదో తెలుసుకునే పరిస్థితి లేదు. కొన్ని దుకాణాల్లో రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల సర్టిఫికెట్లు గోడలకు అలంకారప్రాయంగా కనిపిస్తుండగా, వాస్తవంగా మందుల విక్రయాలు మాత్రం ఇతర వ్యక్తులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల పదో తరగతి, ఇంటర్మీడియట్ కూడా పూర్తి చేయని వారు మందులు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మందుల వినియోగం, మోతాదు, వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై సరైన అవగాహన లేని వ్యక్తుల చేతుల్లో ఔషధ విక్రయాలు ఉండటం రోగుల ఆరోగ్యానికి ముప్పుగా మారే ప్రమాదం ఉంది.

చీటీ లేకుండానే మందులు.. ఇంజక్షన్లు!

వైద్యుల ప్రిస్క్రిప్షన్ అవసరమైన కొన్ని మందులు సైతం ఎలాంటి వైద్య చీటీ లేకుండా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని చర్చి కాంపౌండ్ ప్రాంతంలో ఓ మెడికల్ షాపులో గతంలో లారీ డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తి మందులు విక్రయిస్తున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమ్మిగడ్డ ప్రాంతంలోని కొన్ని కిరాణా దుకాణాల్లో మందులతో పాటు ఇంజక్షన్లు సైతం సులభంగా లభిస్తున్నాయనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి విక్రయాలు జరుగుతున్నాయా? వాటి వెనుక ఎవరున్నారు? సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మందుల ధరలతో రోగులకు అదనపు భారం!

ఒకవైపు అర్హతలేని వ్యక్తుల చేతుల్లో మందుల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉండగా, మరోవైపు కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఔషధాల ధరల విషయంలోనూ రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఇంజక్షన్లకు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు లభించే మందులు, ఇంజక్షన్లకు అధిక మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికే వైద్య చికిత్సల ఖర్చులతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు మందుల బిల్లులు మరింత భారంగా మారుతున్నాయి.

అధికారుల తనిఖీలు ఎక్కడ?


మెడికల్ షాపుల్లో రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల అందుబాటు, మందుల విక్రయాల విధానం, ప్రిస్క్రిప్షన్ నిబంధనలు, మందుల గరిష్ఠ చిల్లర ధరల అమలు వంటి అంశాలను ఔషధ నియంత్రణ శాఖ నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంది. అయితే సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి ఆరోపణలు వినిపిస్తున్నా తనిఖీలు, చర్యలు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై అధికారులు స్పందించకపోవడానికి కారణమేంటని నిలదీస్తున్నారు. మామూళ్ల ఆరోపణలపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి!

జిల్లా కలెక్టర్‌తో పాటు ఔషధ నియంత్రణ శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సూర్యాపేట పట్టణంలోని మెడికల్ షాపులు, ప్రైవేటు ఆసుపత్రుల ఫార్మసీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల అర్హతలు, విధుల నిర్వహణను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రోగుల ప్రాణాలతో ముడిపడిన ఔషధ విక్రయాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీజులు కడితే చాలు.. తరగతులకు వెళ్లాల్సిన పనిలేదు!

బీఈడీ కళాశాలల్లో హాజరు అక్రమాలు.. టీచింగ్ ప్రాక్టీస్ పేరుతో వసూళ్లు



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దాల్సిన బీఈడీ కళాశాలలు అక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలోని పలు కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థుల హాజరు విషయంలో నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 29 బీఈడీ కళాశాలలు ఉండగా, ఐదు వేల మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. అయితే కొన్ని కళాశాలల్లో పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించకుండానే ఫీజుల వసూళ్లకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.విద్యార్థులు కళాశాలలకు క్రమం తప్పకుండా హాజరుకాకపోయినా, రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు అదనంగా వసూలు చేసి హాజరు రికార్డులు సర్దుబాటు చేస్తున్నట్లు సమాచారం. టీచింగ్ ప్రాక్టీస్ పేరుతో పాఠశాలల్లో శిక్షణ పొందినట్లు చూపిస్తూ, పాత రికార్డులు రాయించడం, సంబంధిత ఉపాధ్యాయుల సంతకాలు తీసుకోవడం వంటి వ్యవహారాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. విద్యా సంవత్సరం చివర్లో మాత్రమే విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలల్లో కనిపిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.సీట్ల భర్తీలోనూ అక్రమాలకు ఆస్కారం కల్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వంద సీట్లలో 25 యాజమాన్య కోటాకు కేటాయించగా, కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదని, ఖాళీలను స్పాట్ అడ్జస్ట్మెంట్ పేరుతో భర్తీ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అమలవుతున్న ముఖ గుర్తింపు హాజరు విధానం బీఈడీ కళాశాలల్లోనూ అమలు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. తనిఖీలు కొరవడటంతోనే ఈ పరిస్థితి కొనసాగుతోందన్న విమర్శల నేపథ్యంలో పీయూ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిబంధనలు తప్పనిసరిగా అమలు చేస్తామని, విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా ఆదేశిస్తామని పీయూ వీసీ ఆచార్య జీఎన్ శ్రీనివాస్ వెల్లడించారు.

ఉపాధ్యాయ విద్య - ఉత్త విద్యే


నిబంధనలు బేఖాతరు - అంగడి సరుకుగా బీఈడీ డిగ్రీ



ఉత్తమ పౌరులను తీర్చిదిద్దవలసిన ఉపాధ్యాయ విద్య ఉత్త విద్యగా మారిపోయింది. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత తొంభై శాతం మేర ఉండగా, ప్రైవేటుల్లో నూటికి నూరు శాతం బీఈడీ పట్టా డబ్బుల తూకానికి కిలోల లెక్కన అమ్ముతున్నారు. నూతన విద్యావిధానంలో పకడ్బందీగా చేస్తామని, నాలుగేళ్ళ డిగ్రీగా మారుస్తామని చేసిన బాసలు తుస్సుమన్నాయి. విద్యా కమీషన్ తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యానందించే ప్రైవేటు పుట్టగొడుగుల పైన వేటు వేయాలని, ప్రభుత్వ కళాశాలలను ఉత్తమోత్తంగా తీర్చిదిద్దాలని రాసుకున్న రంగు కాగితాల రాతలు ఆచరణకు నోచుకోకుండానే వెలిసిపోయాయి.జిల్లా కేంద్రాల్లో అటు విద్యాశాఖాధికారి కార్యాలయాలకి, ఇటు డైట్, బీఈడీ కళాశాలలకు కూతవేటు దూరంలో పెద్దపెద్ద హోర్డింగులు బోర్డులతో ఉన్న ప్రైవేటు దందా కళాశాలల్లో అర్హత కలిగిన స్టాఫ్ లేదు. హాజరు లేదు. క్లాసుల నిర్వహణ లేదు. చివరకు టీచింగ్ ప్రాక్టీస్ కూడా ఫీజుల లెక్కన మేనేజ్ చేస్తున్నా అదే కాలేజీల ముందు నుండి ఆన్ గవర్నమెంట్ డ్యూటీ కార్లు గుడ్డిగా తిరుగుతున్నాయి. రికార్డులకొక రేటు, హాజరుకొక రేటు, టీచింగ్ ప్రాక్టీస్ కు ఒక రేటు ఇలా టారిఫ్ లు నిర్ణయించి ఉపాధ్యాయ విద్యను నడిబజార్లో విక్రయిస్తున్నా అడిగే దిక్కులేదు. ప్రభుత్వానికి దిశ లేదు. ఎఫ్ ఆర్ ఎస్ లేకపోవడం, ఉన్న చోట వచ్చి ఫోటోలు దిగిపోవడం కనిపిస్తుంది మినహా ఎక్కడా ఒక విధానం లేదు. ఒక ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో అధికారుల భార్యలు అర్హత లేకున్నా లెక్చరర్లుగా, ప్రిన్సిపాల్లుగా దర్శనమిస్తారు. ఒక్కొక్క పలుకుబడి కలిగిన టీచర్లు ఫారిన్ సర్వీసులో ప్రత్యక్షమవుతారు. ఇలాంటి ఉపాధ్యాయులు సమాజంలోకి, పాఠశాలల్లోకి రావడం వల్లనే నాణ్యత పడిపోయిందన్న సోయి మరచి, స్నేహ వదిలి అడ్డగోలుగా విఫలయత్నాల పోకడలతో పాఠశాల విద్యను పరుగులు పెట్టిస్తున్నారు.జిల్లా విద్యాధికారులు లేకపోవడం ఒక ఎత్తయితే, ఉన్న వారికి విద్యాశాఖపై అవగాహన లేక సెక్టోరల్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న వైనం అనేక జిల్లాల్లో కనపడుతున్నది. కొన్ని జిల్లాల్లో కలెక్టర్ల విపరీత పోకడలు కాగా, మరికొన్ని చోట్ల విద్యను గాలికొదిలేసిన తీరు కనపడుతున్నది. విద్యాశాఖ మంత్రి లేకపోవడం, సీఎం గారికి సమయం లేకపోవడంతో ప్రైవేటు వ్యవస్థ డబ్బుల్ని కొట్టిపోసుకుంటున్న అధ్వాన్నస్థితి ఉన్నది.ఈ వ్యవస్థ మారాలంటే ముందుగా కాస్త విద్యాధికుడైన విద్యాశాఖ మంత్రితో పాటుగా డీఈవోలు నియామకం జరగాలి. ఆపై నియమ నిబంధనల అమలు కోసం కొరడా ఝళిపించాలి. రావుల రాజేశం కవి రచయిత వ్యాసకర్త హైదరాబాద్

టీవీవీపీలో సమస్యల సుడిగుండం.. పట్టించుకునేదెవరు?

- కమిషనర్ నియామకంలో జాప్యం.. పదోన్నతులకు బ్రేకులు
- 150కి పైగా ఆస్పత్రుల నిర్వహణపై ప్రభావం.. ఉద్యోగుల సమస్యలు పెండింగ్



జోర్దార్, తెలంగాణ బ్యూరో

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)లో పరిపాలనా సమస్యలు పేరుకుపోతున్నాయి. పూర్తిస్థాయి కమిషనర్ నియామకం లేక కీలక నిర్ణయాలు పెండింగ్‌లో పడుతుండగా, వైద్యులు, ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, ఇంక్రిమెంట్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 150కి పైగా ఆస్పత్రుల పర్యవేక్షణ బాధ్యతలు ఉన్న ఈ విభాగంలో వందలాది ఫైళ్లు నిలిచిపోయాయని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

పదోన్నతులకు అంతులేని జాప్యం

సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ వైద్యుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను సెప్టెంబర్ 9న విడుదల చేసినా తుది జాబితా ఇంకా ప్రకటించలేదు. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి 30కి పైగా అభ్యంతరాలు రావడంతో పరిశీలన పేరుతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. జీవో నంబర్ 49 ప్రకారం పీజీ అర్హత సాధించిన తేదీ ఆధారంగా సీనియారిటీ నిర్ణయించాలని వైద్యులు కోరుతున్నారు. 2018, 2022 బ్యాచ్‌ల మధ్య నెలకొన్న వివాదాలు కోర్టు కేసుల వరకు వెళ్లాయి. మరోవైపు సుమారు 40 మంది వైద్యుల నుంచి న్యాయవాదుల ఫీజుల పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిసెంబర్‌లోపు పదోన్నతులు పూర్తి చేయకపోతే ప్యానెల్ సంవత్సరం ముగిసి నష్టపోతామని వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

కమిషనర్ నియామకంపై వివాదం

గత కమిషనర్ పదవీ విరమణ తర్వాత పూర్తిస్థాయి అధికారిని నియమించకపోవడంపై మెడికల్ యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సీఎంవోలోని ఓ సీనియర్ అధికారి నియామక ప్రక్రియకు అడ్డుపడుతున్నారని యూనియన్ నేతలు ఆరోపిస్తున్నారు. కమిషనర్ లేకపోవడంతో ఆస్పత్రుల మౌలిక వసతులు, మందుల కొనుగోళ్లు, వైద్య పరికరాల మరమ్మతులు, సిబ్బంది సర్దుబాటు వంటి అంశాలకు సంబంధించిన ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని చెబుతున్నారు. క్షేత్రస్థాయి తనిఖీలు తగ్గడంతో ఆస్పత్రుల పర్యవేక్షణపైనా ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఉద్యోగుల సమస్యలకు పరిష్కారమెప్పుడు?

ఆరు, పన్నెండు, పద్దెనిమిది, ఇరవై నాలుగు సంవత్సరాల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ఇంక్రిమెంట్లు మంజూరు కావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. డీపీసీ సమావేశాలు నిర్వహించకపోవడంతో డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి పదోన్నతులు నిలిచిపోయాయి. జీవో 190 అమలుపై స్పష్టత లేక ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదని, జీవో 317 కారణంగా స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల సమస్య కూడా పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ల జాప్యం, బాన్సువాడ నర్సింగ్ ఆఫీసర్ల సస్పెన్షన్ ఎత్తివేత, రీపోస్టింగ్ అంశాలు కూడా పరిష్కారం కావాల్సి ఉన్నాయి.

ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ ఎస్కే ప్రసన్న అధికారుల తీరుపై విమర్శలు చేస్తూ, కమిషనర్ నియామకంతో పాటు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకుని పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని, పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలని మెడికల్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే నష్టపోయేది ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులపై ఆధారపడే సామాన్య రోగులేనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విజిలెన్స్ నివేదిక బుట్టదాఖలు..
అక్రమార్కులకు అభయహస్తం!

- రూ. కోట్ల ధాన్యం కుంభకోణంపై విచారణ జరిగి నెలలు గడుస్తున్నా కానరాని చర్యలు
- డీఎస్ఓ నర్సింగరావు, జమ్మికుంట లోనే ఒక రైస్ మిల్లు యాజమాన్యంపై ఉదాసీనత ఎందుకు?
- బకాయిలు చెల్లించకపోయినా, నిబంధనలు ఉల్లంఘించినా కమిషనర్ కార్యాలయంలో కదలిక శూన్యం!



(కరీంనగర్ / హైదరాబాద్, జోర్దార్ నిఘా బ్యూరో):

కరీంనగర్ జిల్లా పౌర సరఫరాల శాఖలో వెలుగుచూసిన భారీ ధాన్యం కుంభకోణంపై ఉన్నతాధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. జమ్మికుంటలోని ఇక రైస్ మిల్లు' అక్రమాలపై గతంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి, సమగ్ర విచారణ నివేదికను రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌కు అందజేసినప్పటికీ, ఇంతవరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సాక్ష్యాధారాలతో నివేదిక ఇచ్చినా చర్యలేవీ?

కరీంనగర్ జిల్లా పౌర సరఫరాల శాఖలో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు అందిన ఫిర్యాదు మేరకు, గతంలో విజిలెన్స్ డీఎస్పీ సీతా రెడ్డి నేతృత్వంలోని బృందం జమ్మికుంట లోని ఒక రైస్ మిల్లుపై దాడులు చేసింది. ఈ దాడుల్లో మిల్లులో ఉండాల్సిన ధాన్యం నిల్వలు మాయమైనట్లు, తప్పుడు రికార్డులతో ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు విజిలెన్స్ అధికారులు స్పష్టంగా నిర్ధారించారు. నిబంధనల ఉల్లంఘనలు, ధాన్యం లోటుపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి, డీఎస్ఓపై కఠిన క్రమశిక్షణా చర్యలు మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు కూడా చేశారు. అయితే, విచారణ జరిగి నివేదిక అంది నెలలు గడుస్తున్నా నేటికీ ఆ ఫైలు కదలకపోవడం గమనార్హం.

డీఎస్ఓ నర్సింగరావు అక్రమాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) నర్సింగరావు బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి కార్పొరేషన్ సంపదను అక్రమంగా దోచిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఆదేశాల ధిక్కరణ టెండర్ ధాన్యం బకాయిలు ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయించవద్దని కమిషనర్ నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, డీఎస్ఓ వాటిని బేఖాతరు చేస్తూ సప్తగిరి మిల్లుకు ధాన్యం కట్టబెట్టారు.

నిల్వలు లేకుండానే షిఫ్టింగ్: మిల్లులో అసలు ధాన్యం నిల్వలు లేకపోయినా, ఉన్నట్లుగా తప్పుడు ధృవీకరణ పత్రాలతో అక్రమ షిఫ్టింగ్‌కు సహకరించారు.బ్యాంక్ గ్యారెంటీ లేకుండానే రూ. 10 కోట్ల ధాన్యం: 2025-26 ఖరీఫ్ సీజన్‌లో నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారెంటీలు తీసుకోకుండానే దాదాపు రూ. 10 కోట్ల విలువైన ధాన్యాన్ని అక్రమంగా కేటాయించి మిల్లుకు వత్తాసు పలికారు. పేరుకుపోయిన బకాయిలు: సదరు మిల్లు యాజమాన్యం గత టెండర్ ధాన్యం డబ్బులు చెల్లించలేదు, అటు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని కూడా ఇప్పటివరకు అప్పగించలేదు.

అక్రమార్కులను కాపాడుతున్నదెవరు?

ఇన్ని అక్రమాలు కళ్లముందే కనిపిస్తున్నా, విజిలెన్స్ నివేదిక సైతం డీఎస్ఓ పాత్రను ఎత్తిచూపినా రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయం ఎందుకు మౌనంగా ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ తక్షణమే స్పందించి, విజిలెన్స్ నివేదిక ఆధారంగా డీఎస్ఓ నర్సింగరావుపై సస్పెన్షన్ వేటు వేయాలని, జమ్మికుంట లోని ఒక రైస్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రూ. కోట్ల ప్రజాధనాన్ని రికవరీ చేయాలని స్థానిక , ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తెలంగాణ మెడికల్ కళాశాలలకు మహర్దశ!

- తొమ్మిది కళాశాలలకు అదనంగా రూ.365.40 కోట్ల నిధులు మంజూరు
- పెండింగ్ పనుల పూర్తికి సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక చొరవ



హైదరాబాద్ (జోర్దార్ ప్రతినిధి):

తెలంగాణలో రెండో విడతలో ఏర్పాటు చేసిన తొమ్మిది ప్రభుత్వ వైద్య కళాశాలలకు మహర్దశ పట్టనుంది. మౌలిక వసతుల అభివృద్ధి, పెండింగ్ నిర్మాణ పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 365.40 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో ఈ తొమ్మిది కళాశాలల మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 1,645 కోట్ల నుంచి రూ. 2,010.40 కోట్లకు చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వైద్య కళాశాలల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.కుమురం భీం ఆసిఫాబాద్‌కు రూ. 73.40 కోట్లు, ఖమ్మంకు రూ. 63.40 కోట్లు, నిర్మల్‌కు రూ. 44.40 కోట్లు, వికారాబాద్‌కు రూ. 41 కోట్లు, జయశంకర్ భూపాలపల్లికి రూ. 39 కోట్లు, కరీంనగర్‌కు రూ. 29.40 కోట్లు, జనగామకు రూ. 25.40 కోట్లు, రాజన్న సిరిసిల్లకు రూ. 25 కోట్లు, కామారెడ్డికి రూ. 24.40 కోట్ల చొప్పున అదనపు నిధులు కేటాయించారు. రోడ్లు, భవనాల శాఖకు రూ. 1,535.40 కోట్లు కేటాయించగా, తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు రూ. 475 కోట్లు కేటాయింపులు కొనసాగనున్నాయి. ఇందులో ఆసుపత్రుల మౌలిక వసతులకు రూ. 240 కోట్లు, వైద్య పరికరాలకు రూ. 235 కోట్లు వెచ్చించనున్నారు.జాతీయ వైద్య మండలి నిబంధనలకు అనుగుణంగా సదుపాయాల కల్పనతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే అదనపు నిధుల మంజూరుతోనైనా ఇప్పటివరకు ఎదురైన సమస్యలు తొలగి, వైద్య కళాశాలలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయా? అన్నది వేచి చూడాలి.

"రాజకీయాలకు వన్నె తెచ్చిన ఇందిరా గాంధీ "

ఆమె పోరాట పటిమ గల నాయకురాలు ఉక్కు మహిళగా దిశాలిగా గొప్ప రాజకీయ నాయకు రాలిగా చరిత్ర పుటల్లో స్థానం పొందారు రాజకీ యాలకే కేంద్ర బిందువు అయ్యారు

భారతదేశ రాజకీయ చరిత్రలో ఇందిరా గాంధీ పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. 1917 నవం బర్ 19న అలహాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ దంపతులకు జన్మించారు. చిన్నతనం నుంచే స్వాతంత్ర్య ఉద్యమ వాతావ రణంలో పెరిగారు.

1966 జనవరి 24న భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1969లో బ్యాంకుల జాతీయీకరణ, హరిత విప్లవానికి ప్రోత్సాహం, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం, బం గ్లాదేశ్ ఆవిర్భావం ఆమె పాలనలో జరిగిన ముఖ్యమైన పరిణామాలు.

1975లో దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ప్రకటించడం ఆమె రాజకీయ జీవి తంలో వివాదాస్పద ఘట్టంగా నిలిచింది. 1977లో ఎన్నికల్లో ఓడిపోయి, 1980లో తిరిగి ప్రధానమంత్రి అయ్యారు.

1984 అక్టోబర్ 31న హత్యకు గురయ్యారు.వారి చరిత్రను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలి



నవంబర్ 19 ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా

కామిడి సతీష్ రెడ్డి
జడల్ పేట
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

రామగిరి మండలానికి
568 కొత్త పింఛన్లు మంజూరు!

- బేగంపేటలో అత్యధికంగా 89 మందికి అవకాశం
- వితంతువులు 323 మంది.. దివ్యాంగులు 110 మందికి లబ్ధి



రామగిరి, జోర్దార్ ప్రతినిధి:అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రామగిరి మండలంలో ప్రభుత్వం కొత్తగా 568 చేయూత పింఛన్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఎంపీడీవో శైలజారాణి వెల్లడించారు. మండలంలోని 16 గ్రామపంచాయతీల పరిధిలో అర్హులను గుర్తించి నూతన పింఛన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామాల వారీగా పరిశీలిస్తే బేగంపేటలో అత్య ధికంగా 89 మందికి పింఛన్లు మంజూరయ్యా యి. పెద్దంపేట, రాజాపూర్ గ్రామాల్లో అత్యల్ప ంగా 12 మందికి చొప్పున పింఛన్లు మంజూ రయ్యాయి.

వర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు:

మండలవ్యాప్తంగా వితంతువులు 323 మంది, దివ్యాంగులు 110 మంది, కల్లుగీత కార్మికులు 85 మంది, ఒంటరి మహిళలు 48 మంది, చేనే త కార్మికులు ఇద్దరు కలిపి మొత్తం 568 మంది నూతన పింఛన్లకు అర్హత సాధించారు.కొత్త పింఛన్ల మంజూరుతో తమకు ఆర్థిక చేయూత అందుతుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన వారికి ప్రభుత్వ పింఛన్ పథకం ద్వారా సామాజిక భద్రత కల్పించే దిశగా ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

వినడం లేదా చదవడం..

రెండింటిలో ఏది ఎక్కువ ప్రయోజనం ఇస్తుంది..?

పుస్తకం చదివి నేర్చుకోవడం, ఆడియో రూపంలో విని తెలుసుకోవడం.. ఈ రెండింటిలో ఏది మెరుగైన పద్ధతి అనే సందేహం చాలా మందికి ఉంటుంది.

పాడ్‌కాస్ట్‌లు, ఆడియో పుస్తకాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ చదవడం ఎందుకు ముఖ్యమనే ప్రశ్న కూడా తలెత్తుతుంది. భాషను మన మెదడు ఎలా అర్థం చేసుకుంటుంది, జీవసంబంధమైన అంశాలు, సామాజిక అనుభవాలు భాషా నైపుణ్యాలను ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. పుస్తకం చదివినా, ఎవరో చెప్పేది విన్నా ప్రధాన లక్ష్యం సమాచారాన్ని అర్థం చేసుకోవడమే. అయితే ఈ రెండు ప్రక్రియలు ఒకేలా ఉండవు. రెండింటిలోనూ మెదడులోని కొన్ని భాషా, ఆలోచనా వ్యవస్థలు పనిచేసినప్పటికీ, సమాచా రాన్ని స్వీకరించే విధానాన్ని బట్టి మెదడు వేర్వేరు పనులు చేస్తుంది. అందువల్ల వినడం వల్ల చదవడం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలు రావు. అలాగే చదవడం వల్ల వినడం ద్వారా పొందే అన్ని అనుభవాలు లభించవు. రెండింటికీ ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

చదువుతున్నప్పుడు ఏం జరుగుతుంది..?

పుస్తకం చదివేటప్పుడు మెదడు అనేక దశల్లో పనిచేస్తుంది. ముందుగా అక్షరాల ఆకృతులను గుర్తించి, వాటిని పలుకుల శబ్దాలతో అనుసంధా నిస్తుంది. ఆ శబ్దాలకు సంబంధించిన అర్థాలను గ్రహించి, పదాలు, వాక్యాలు, పేరాగ్రాఫ్‌ల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకుంటుంది. విరామ చిహ్నాలు, పేరాగ్రాఫ్‌ల విభజన, ముద్రించిన అక్షరాల ప్రత్యేక గుర్తులు వంటి అంశాలు సమా చారాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడ తాయి. అలాగే పాఠకులు తమకు అనుకూలమైన వేగంతో చదవవచ్చు. అవసరమైతే ఒక వాక్యాన్ని మళ్లీ చదవవచ్చు. వినేటప్పుడు మాత్రం మాట్లాడే వ్యక్తి వేగానికి అనుగుణంగా సమాచారాన్ని గ్రహించాలి.

మాట్లాడిన మాటలు క్షణాల్లో ముగిసిపోతాయి కాబట్టి, అప్పుడే విన్న విషయాలను జ్ఞాపకంలో ఉంచుకుని తదుపరి మాటలతో అనుసంధాని ంచాలి. మాట్లాడేటప్పుడు పదాల మధ్య స్పష్టమైన విరామాలు ఉండవు. శబ్దాలు ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. దీంతో ఏ శబ్దం ఏ పదానికి చెం దుతుందో మెదడు త్వరగా గుర్తించాలి. పదాల అర్థాన్ని తెలుసుకోవడంతోపాటు మాట్లాడే వ్యక్తి స్వరం, ఎవరు మాట్లాడుతున్నారు, సందర్భం ఏమిటి వంటి అంశాలను కూడా గమనించాలి.

వినడం సులభమా..?

చదవడం కంటే వినడం సులభమని చాలామంది భావిస్తారు. కానీ క్లిష్టమైన లేదా కొత్త విష యాలను అర్థం చేసుకోవడంలో వినడం కొన్ని సార్లు మరింత కష్టంగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కల్పిత కథల వంటి సరళమైన విషయాల్లో చదవ డం, వినడం ద్వారా సమాచారాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం దాదాపు ఒకేలా ఉంటాయి. అయితే వాస్తవాలు, భావనలు లేదా ఒక ప్రక్రియ ఎలా పనిచేస్తుందో వివరించే వ్యాసాలు, పుస్తకాల విషయంలో తేడాలు కనిపిస్తాయి. కల్పిత కథలు చదివేటప్పుడు సామాజిక అవగాహన, కథనానికి సంబంధించిన మెదడు భాగాలు చురుకుగా పనిచేస్తాయి. సమాచారాత్మక రచనలు చదివేటప్పుడు వ్యూహాత్మక ఆలోచన, లక్ష్యంపై దృష్టి పెట్టేందుకు సహాయపడే మెదడు వ్యవస్థలు పనిచేస్తాయి. కష్టమైన విషయాలను చదవడం ద్వారా అర్థం చేసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎందుకంటే చదివేవారు అవసరమైన చోట ఆగి మళ్లీ చదవవచ్చు, ముఖ్యమైన అంశాలను గుర్తు పెట్టుకోవచ్చు.వినేటప్పుడు అర్థం కాని విషయాన్ని తెలుసు కోవడానికి ఆడియోను ఆపి వెనక్కి వెళ్లి మళ్లీ వినాలి. దీనివల్ల వినే ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది.

ఏది ఎక్కువ ప్రయోజనకరం..?

సమాచారాన్ని ఎంత శ్రద్ధగా స్వీకరిస్తున్నామన్నది కూడా నేర్చుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చదివేటప్పుడు లేదా వింటున్నప్పుడు మనసు పూర్తిగా విషయంపై కేంద్రీకరించడం, సమాచా రాన్ని ఆలోచించడం, ఇప్పటికే తెలిసిన విషయా లతో అనుసంధానించడం అవసరం. చాలామంది వ్యాయామం చేస్తూ, వంట చేస్తూ లేదా ఇంటర్నెట్ చూస్తూ పాడ్‌కాస్ట్‌లు వింటుంటారు. అదే సమయంలో పుస్తకం చదవడం అంత సులభం కాదు.

కళాశాల విద్యార్థులపై నిర్వహించిన ఒక పరిశోధనలో కొందరిని ఒక విషయాన్ని చదవమని, మరికొందరిని అదే విషయాన్ని పాడ్‌కాస్ట్ రూపంలో వినమని కోరారు. అనంతరం నిర్వహించిన పరీక్షలో చదివిన విద్యార్థులు, విన్నవారి కంటే మెరుగైన ఫలితాలు సాధించారు.

పాడ్‌కాస్ట్ విన్నవారిలో చాలామంది అదే సమయంలో కంప్యూటర్‌లో ఇతర పనులు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా వినడం ద్వారా సమాచారాన్ని అర్థం చేసుకోవాలంటే పూర్తి శ్రద్ధ అవసరమని ఈ పరిశోధన సూచించింది. కాబట్టి పుస్తకాలు చదవడం ఇప్పటికీ ముఖ్యమే. వినడం, చదవడం రెండింటినీ ఒకే విధంగా భావించకుండా, వాటి ప్రత్యేక ప్రయోజనాలను

ఆలయానికి ఆత్మీయ కానుక
కన్యకా పరమేశ్వరి ఆలయానికి కుర్చీల వితరణ!



రామగిరి జోర్దార్ ప్రతినిధి:సామాజిక సేవలో భాగంగా సెంటినరీ కాలనీలోని కన్యకా పరమే శ్వరి ఆలయానికి వీ ఆర్ రియల్ ఎస్టేట్స్, ఎస్. ఎస్. ప్రాపర్టీస్ సంస్థల తరఫున కుర్చీలను వితర ణగా అందించారు.వీ ఆర్ రియల్ ఎస్టేట్స్ ప్రతి నిధులు పుదురుకోట రాజశేఖర్, రాసమల్ల సందీప్, బైరం రాజు సంయుక్తంగా ఆలయానికి కుర్చీలను అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు, వివిధ కార్యక్రమాలకు ఇవి ఉపయో గపడనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వా హకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్య క్రమంలో బీజేపీ సీనియర్ కార్యకర్త ములుమూరి శ్రీనివాస్, దొంతుల సురేష్, కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు గుండయ్య, గంప బాపు, గుం డ శంకరయ్య, చంద్రన్న, గుండ సుధాకర్ తది తరులు పాల్గొన్నారు.

తొమ్మిది ప్రభుత్వ వైద్య కళాశాలలకు
రూ.365.40 కోట్ల అదనపు నిధులు

హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి: రాష్ట్రంలోని రెండో విడతలో ఏర్పాటు చేసిన తొమ్మిది ప్రభుత్వ వైద్య కళాశాలలకు తెలంగాణ ప్రభుత్వం అదనంగా రూ.365.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా కళాశాలల మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.1,645 కోట్ల నుంచి రూ.2,010.40 కోట్లకు పెరిగింది. వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అసంపూర్తి నిర్మాణ పనుల పూర్తి, ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాల సమకూర్పు కోసం అదనపు నిధులను కేటాయించింది.సవరించిన కేటాయింపుల ప్రకార ం రోడ్లు, భవనాల శాఖకు రూ.1,170 కోట్లుగా ఉన్న నిధులను రూ.1,535.40 కోట్లకు పెంచి ంది. తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపా యాల అభివృద్ధి సంస్థకు కేటాయించిన రూ.475 కోట్లలో మార్పు చేయలేదు. ఇందులో ఆసుప త్రుల మౌలిక సదుపాయాలకు రూ.240 కోట్లు, వైద్య పరికరాల కొనుగోలుకు రూ.235 కోట్లు కేటాయించారు.కళాశాలల వారీగా కొమురం భీం ఆసిఫాబాద్‌కు రూ.73.40 కోట్లు, ఖమ్మంకు రూ.63.40 కోట్లు, నిర్మల్‌కు రూ.44.40 కోట్లు, వికారాబాద్‌కు రూ.41 కోట్లు, జయశంకర్ భూపాలపల్లికి రూ.39 కోట్లు, కరీంనగర్‌కు రూ.29.40 కోట్లు, జనగామకు రూ.25.40 కోట్లు, రాజన్న సిరిసిల్లకు రూ.25 కోట్లు, కామారెడ్డికి రూ.24.40 కోట్ల చొప్పున అదనపు నిధులు కేటాయించారు.ఈ నిధులతో భవన నిర్మాణాలు, ఆసుపత్రుల అభివృద్ధి, జీవ వైద్య పరికరాల ఏర్పాటు చేపట్టనున్నారు. జాతీయ వైద్య మండలి నిబంధనలకు అనుగుణంగా అవసరమైన సదుపాయాలను కల్పించడంతో పాటు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.అయితే రాష్ట్రంలోని పలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాల కొరత, నిర్మాణ పనుల జాప్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని ఆయా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు నిధులు సక్రమంగా వినియోగమవుతున్నాయా?

పనులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు పూర్తవుతు న్నాయి? అనే అంశాలపై అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని, మీడియా కూడా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి సంబంధిత అధికారులను ప్రశ్నించాలని వైద్య కళాశాలల వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
గురువారం, నవంబర్ 19 2026

నూతన చేయూత పింఛను లబ్ధిదారులకు
మంజూరీ పత్రాల పంపిణీ



హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలకు అందిస్తున్న చేయూత పింఛన్లు వారి జీవనానికి ఎంతో అండగా నిలుస్తున్నాయని అన్నారు. నూతనంగా పింఛన్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కొయ్యడ దీపిక-సందీప్, వార్డు సభ్యులు కొయ్యడ మౌనిక, తీగల నరేష్, జోరుక రాజేందర్, పంచాయతీ కార్యదర్శి హేమలత, కారోబార్ చాతల్ల సదానందం, మాజీ సర్పంచ్ జోరుక పూల, తాళ్లపెల్లి రమేష్, కొయ్యడ సునీల్, సౌరం సుధాకర్, చరణ్ తేజ, కొయ్యడ విజయ్ కుమార్,గణేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:
హుజూరాబాద్ మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హుజూరాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, ఇతర అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితిని నివారించాలని అన్నారు.రైతుల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, పట్టణ మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శి తిప్పబతిని రాజు, ఉపాధ్యక్షుడు యాళ్ల సంజీవరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొలిపాక వెంకటేష్, పట్టణ కార్యదర్శి గుర్రం సంతోష్,
కొడిమ్యాల పవన్, బోడిగ రాధ, కొలుగూరి అనిల్, కోశాధికారి క్యాస వెంకటేష్, సీనియర్ నాయకులు నరాల రాజశేఖర్, యాం సాని శశిధర్, అంకతి వాసు, బోరగాల సారయ్య, కురిమిళ్ల శ్రీధర్, బూత్ అధ్యక్షులు డోరి అయిలయ్య, ఆవుల సదయ్య, చతర్ సింగ్, పోలోజు కిరణ్, పర్ధం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు 15 నిక్షయ్
పోషణ కిట్ల పంపిణీ



- క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణమే మన లక్ష్యం
- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో టీబీ రోగులకు అండగా నిలవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో 15 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు ఆయన నిక్షయ్ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు నిర్దిష్ట సమయానికి క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. మందులతో పాటు పోషక విలువలున్న సమతుల్య ఆహారం తీసుకుంటే వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ కనీసం ఒక టీబీ రోగిని ఆరు నెలల పాటు దత్తత తీసుకొని, వారికి పోషకాహార సహాయం అందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని కల్పించాలని కోరారు.

ఈ సందర్భంగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ మల్లేశం టీబీ రోగుల సంక్షేమం కోసం 10 నిక్షయ్ పోషణ కిట్లు అందించేందుకు ముందుకు రావడాన్ని డా. అప్పయ్య అభినందించారు.ఈ కార్యక్రమంలో టి-సాక్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డా. ఇందిరా, అడిషనల్ డీఎంహెచ్ఓ డా. మధన్ మోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఇన్‌ఛార్జ్ జిల్లా క్షయ నివారణ అధికారి డా. ప్రదీప్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణారావు, ఏఓ రాజేష్ కుమార్ గౌడ్, ఎంజీఎం ఏఆర్టీ నోడల్ అధికారి డా. సూర్యప్రకాష్, మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి, డీహెచ్ఈఓ సందెల శ్రీనివాస్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ కిరణ్, నగేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణలో హనుమకొండ జిల్లాకు అరుదైన గుర్తింపు

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:హెచ్ఐవీ,ఎయిడ్స్ నివారణ,నియంత్రణ కార్యక్రమాల అమలులో హనుమకొండ జిల్లా విశేష ప్రగతి సాధించి ప్రతిష్టాత్మకమైన సురక్షిత్ జిల్లా గుర్తింపును సొంతం చేసుకుంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను విజయవంతంగా సాధించడం ద్వారా జిల్లా ఈ ఘనతను సాధించింది. జిల్లా సాధించిన ఈ విజయంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిలో హర్షం వ్యక్తమవుతోంది.ఈ విజయానికి గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీఎస్ఏసీఎస్) ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను ఘనంగా సన్మానించారు. టీఎస్ఏసీఎస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇందిర కలెక్టర్‌కు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. జిల్లాకు సురక్షిత్ జిల్లా గుర్తింపు లభించడం ఒక్కరి కృషి వల్ల సాధ్యమైనది కాదని,వైద్య ఆరోగ్యశాఖ అధికారులు,క్షేత్రస్థాయి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సమిష్టి కృషి, అంకితభావం, సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.ఈ గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందని,ఇదే స్ఫూర్తితో హెచ్ఐవీ,ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భవిష్యత్తులో సురక్షిత్ ప్లస్ స్థాయిని సాధించే దిశగా అధికారులు,సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్ రావు, ఏఆర్టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యప్రకాష్,డెమో ప్రసాద్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న, మాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ, అకౌంటెంట్ కమలాకర్, ఐసీటీసీ కౌన్సిలర్ రాపర్తి సురేష్, సహయోగి శిరీష, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మూగజీవుల దాహార్తి తీర్చేందుకు
నీటి తొట్టి నిర్మాణం

రామగిరి జోర్దార్ ప్రతినిధి:ఎండల తీవ్రత దృష్ట్యా గ్రామ పంచాయతీ చొరవ.. పనులకు ముగ్గు పోసిన సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్
ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించిన గ్రామ సర్పంచ్ శ్రీమతి కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ పశువుల కోసం నీటి తొట్టి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నీటి తొట్టి నిర్మాణ పనులకు సర్పంచ్ స్వయంగా ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. వేసవి కాలంలో పశువులు, ఇతర మూగజీవులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.మూగజీవుల పట్ల మానవత్వంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను గుర్తుచేసేలా గ్రామ పంచాయతీ ఈ చర్యలు చేపట్టడం గ్రామస్థుల దృష్టిని ఆకర్షించింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, క్షేత్ర సహాయకుడు నాగేష్ పాల్గొన్నారు



సామాజిక శ్రేయస్సు కవిత్వానికి పరమావధి

- జిల్లా విద్యాధికారి లోకిని లలిత

భూపాల్ పల్లి జోర్దార్ ప్రతినిధి:
కవిత్వం అనేది కేవలం పదాల అల్లిక కాదు... అది మనసులోని భావాలకు అక్షర రూపం అని భూపాల్ పల్లి జిల్లా విద్యాధికారి లోకిని లలిత అన్నారు జిల్లా గ్రంధాలయం లో కవి సమ్మేళనం లో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు
హృదయంలో కలిగే ఆనందం, ఆవేదన, ఆలోచన, ఆవేశం, ప్రేమ, మానవత్వం వంటి భావాలను అందంగా వ్యక్తపరిచే అద్భుతమైన సాహిత్య ప్రక్రియ కవిత్వం.అని అన్నారు.
సభాధ్యక్షులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజ బాబు మాట్లాడుతూ భూపాల్ పల్లి జిల్లా కవులకు ఈచయితలకు నిలయం అన్నారు చంద్ర బోస్ మిట్టపల్లి సురేందర్ లాంటి కవులు సినీ రంగంలో రాణిస్తున్నారని కవులు సామాజిక సమస్యల మీద రచనలు చేయాలని అన్నారు కాటారంకి చెందిన గొప్ప కవి గడ్డం లక్ష్మయ్య తన కవితా పుస్తకాలతో ఎంతో మంది ప్రజల ఆదరాభిమానాలు పొందారని వివిధ శతకాలు రాసి పలువురిచే ప్రశంసలు పొందిన ఘనత వారికే దక్కుతుందని అన్నారు జయశంకర సారస్వత సమితి వ్యవస్థాపక ప్రెసిడెంట్ గా ఎన్నో కవి



సమ్మేళనాలు నిర్వహిస్తూ కవుల్లో చైతన్యం తెస్తున్నారని అన్నారు ప్రతి ఏటా నిర్వహించే గ్రంథాలయ వారాన్ని అందరూ విజయవంతం చేయాలని అన్నారు గ్రంథాలయాల ఉపయోగం మీద ప్రతి కవి తమ కవిత్వం ని వినిపించారని అన్నారు
గౌరవ అతిథి గడ్డం లక్ష్మయ్య మాట్లాడుతూ కవిత్వం సమాజానికి దర్పణం అని కవి తన



కలంతో సమాజంలోని అన్యాయాలను ప్రశ్నిస్తాడని అన్నారు.కవిత్వం అంటే
ప్రజల్లో చైతన్యాన్ని కలిగించి మనిషిలో మానవత్వాన్ని మేల్కొలుపు తుందని కామిడి సతీష్ రెడ్డి అన్నారు తమ జడల్ పేట గ్రామ ప్రాముఖ్యత గురించి కవిత వినిపించారు
మరో అతిథి వివేకానంద సేవ సంస్థ స్థాపకులు కోలుగోరి సంజీవ రావు మాట్లాడుతూ ప్రకృతి అందాలను కవిత్వం ద్వారా అక్షరాల్లో చెప్పి కాకి కోయిల గూర్చి కాక పీక కవిత వినిపించారు
మరో కవి దుప్పటి మొగిలి మాట్లాడుతూ కవిత్వానికి కాలం లేదు, కవిత్వానికి కులం లేదు, మతం లేదు, ప్రాంతీయ భేదాలు లేవని మంచి కవిత మనిషి హృదయాన్ని తాకుతుందని సుదీర్ఘ గ్రంథాలయ కవిత వినిపించారు.
మరో కవి నల్లగొండ సురేష్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ తీరు తెన్నులు గూర్చి వినసొంపు అయిన కవిత వినిపించారు
కవిత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని మరో రచయిత గాయకుడు రమేష్ చంద్ర అన్నారు
కవి కలం కదిలితే అక్షరాలు పలుకుతాయని మహిళా కవులు అల్లే జ్యోతి ,సహస్ర లు తమ కవిత్వం లో వినిపించారు
కవిత్వం వెల్లివిరిస్తే హృదయాలు స్పందిస్తాయని కవి గొంతు వినిపిస్తే సమాజం ఆలోచిస్తుందని గ్రంథాలయాలు కాపాడుకోవాలని అన్నారు
కవి కలం తిరగబడితే చరిత్ర సైతం మారుతుందని వెంకటేశ్వర్లు అన్నారు ఈ కార్యక్రమం లో గ్రంథాలయ అధికారి రాజేంద్ర ప్రసాద్ మురళి పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు అనంతరం కవులను సన్మానించారు

సిజేరియన్ ప్రసవాలను తగ్గించి
సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:గర్భిణులకు అనవసరంగా సిజేరియన్ ఆపరేషన్లు చేయకుండా, సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ప్రోగ్రాం ఆఫీసర్ (మాతా శిశు) డాక్టర్ రజిత ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు.ఈ మేరకు హనుమకొండ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో ప్రసవాల నిర్వహణ తీరును పరిశీలించి, అవసరం ఉన్నప్పుడే వైద్య పరమైన కారణాలతో సిజేరియన్ ఆపరేషన్లు చేయాలని సూచించారు.తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.



అలాగే స్కానింగ్ కేంద్రాలు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, స్కానింగ్‌కు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. చట్ట నిబంధనలను ఉల్లంఘించే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ రజిత హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు కష్టపడి పట్టుదలతో చదవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు.ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రజలకు పోలీసులను మరింత చేరువ చేసేందుకు మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యార్థులు చదువుతో పాటు శారీరక దృఢత్వం,ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని,రోడ్డు ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు తప్పక హెల్మెట్ ధరించేలా చూడాలని,మాదకద్రవ్యాల వినియోగం,గంజాయి అక్రమ రవాణా, బాల్యవివాహాల సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ఇచ్చి అభినందించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు.
వార్డు కౌన్సిలర్ మీరాబాయి, డీఈవో మాధవి, గిరిజన విద్యాధికారి పార్థసారథి, కాంప్లెక్స్ హెచ్ఎం లచ్చిరాం, హెచ్ఎం పిల్లి కిషన్,సీఐ నాగరాజు,ఎస్సైలు జీవన్‌రెడ్డి,లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రత్నాపూర్ పాక్స్‌కు తిరిగి పూర్వవైభవం!

- పాత పేరుతోనే సహకార సంఘం పునరుద్ధరణకు ప్రభుత్వ ఉత్తర్వులు
- సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు అభ్యంతరాలు, ఆధారాలతో సాధించిన విజయం

రామగిరి, జోర్దార్ ప్రతినిధి:రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి ఎట్టకేలకు న్యాయం జరిగింది. గతంలో రత్నాపూర్ పేరుతో కొనసాగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్)ను రద్దు చేసి కమాన్‌పూర్ సంఘంలో విలీనం చేయగా, తిరిగి పాత పేరుతోనే రత్నాపూర్ పాక్స్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు చేసిన నిరంతర ప్రయత్నాలు, సమర్పించిన ఆధారాలు ఫలించడంతో గ్రామానికి పూర్వపు గుర్తింపు దక్కింది.గతంలో రత్నాపూర్ పేరుతో ఉన్న సహకార సంఘాన్ని తొలగించి కమాన్‌పూర్ పాక్స్‌లో కలిపారు. అనంతరం 2020 నవంబర్ 20న పన్నూరు పేరుతో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేస్తూ



ఆర్‌సీ నంబర్ 50/2020 ద్వారా గెజిట్ విడుదల చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అప్పటి సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, గ్రామస్తులు రత్నాపూర్ పాక్స్‌కు సంబంధించిన పాత ఆధారాలను సేకరించి 2020 జనవరిలోనే జిల్లా కలెక్టర్, జిల్లా సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో 2025 జనవరి 3న మరోసారి జిల్లా సహకార అధికారికి లిఖితపూర్వకంగా అభ్యంతరాలు సమర్పించారు. పాత రికార్డులు, ఆధారాలను చూపిస్తూ రత్నాపూర్ పేరుతోనే సహకార సంఘాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు రత్నాపూర్ పాత పేరును పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 240 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 నవంబర్ 11న విడుదలైన ప్రభుత్వ గెజిట్ నంబర్ 8983/జశీశీజూలో సీరియల్ నంబర్ 153 కింద రత్నాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పేరును అధికారికంగా ప్రకటించింది.

పట్టువదలని ప్రయత్నానికి ఫలితం..
గ్రామానికి సంబంధించిన పాత సహకార సంఘం గుర్తింపును తిరిగి సాధించేందుకు ఆధారాలతో అధికారుల చుట్టూ తిరుగుతూ పోరాటం చేసిన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు ప్రయత్నాలు ఫలించాయి. రత్నాపూర్ పాక్స్‌ను పాత పేరుతోనే పునరుద్ధరించేలా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడటంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సహకరించి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చెప్పాల్సిన న్యాయవాదే లంచం కేసులో అడ్డంగా బుక్కయ్యాడు!

రూ.1.50 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్

● నిందితులకు అనుకూలంగా సాక్షుల విచారణ జరిపిస్తానంటూ రూ.2 లక్షల డిమాండ్..
మధ్యవర్తితో సహా ఇద్దరి అరెస్ట్



పెద్దపల్లి, జోర్దార్ ప్రతినిధి:న్యాయస్థానంలో న్యాయం కోసం ప్రభుత్వ తరఫున వాదించాల్సిన పబ్లిక్ ప్రాసిక్యూటరే లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడిన ఘటన పెద్దపల్లి జిల్లాలో సంచలనం సృష్టించింది. ధర్మారం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో నిందితులకు అనుకూలంగా సాక్షుల విచారణ జరిగేలా చేసి, వారు కేసు నుంచి నిర్దోషులుగా బయటపడేందుకు సహకరిస్తానంటూ రూ.2 లక్షలు డిమాండ్ చేసి, చివరకు రూ.1.50 లక్షలకు ఒప్పుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.పెద్దపల్లి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న దొంకెన రవీందర్ ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. లంచం సొమ్మును నేరుగా తీసుకోకుండా రెడ్డిరాజుల రాజయ్య అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా స్వీకరించేందుకు ప్రయత్నించారు. ఈ సమాచారాన్ని ముందుగానే అందుకున్న కరీంనగర్ ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా పెట్టారు.

నివాసంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

పెద్దపల్లిలోని రవీందర్ నివాసంలో ప్రైవేట్ వ్యక్తి రాజయ్య ద్వారా రూ. 1.50 లక్షల లంచం సొమ్ము స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరు పరిచేందుకు చర్యలు చేపట్టారు.

న్యాయవ్యవస్థలో అవినీతిపై చర్చ

ప్రభుత్వం తరఫున కేసులను సమర్థంగా వాదించి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌పై లంచం ఆరోపణలు రావడం, ఏసీబీకి పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. కేసులో సాక్షుల విచారణను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది. ఈ కేసు ప్రస్తుతం ఏసీబీ దర్యాప్తులో ఉంది.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రజలకు సూచించారు. అవినీతికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు



హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 563పై బావుపేట క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన మేకల విజేందర్ (46), సయ్యద్ అఫ్జల్‌లు మట్టెడ కుమారస్వామి వద్ద సెంట్రింగ్ సామగ్రిని ఆటోలో లోడ్ చేసుకుని సూరారం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు.ఈ క్రమంలో అదే రోజు రాత్రి 7.30 గంటల సమయంలో బావుపేట క్రాస్ వద్ద గ్రీన్ వ్యాలీ జూనియర్ కళాశాల బ్రిడ్జి సమీపానికి చేరుకోగానే,ఆటో డ్రైవర్ రాంగ్ రూట్‌లో నడపడంతో పాటు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విజేందర్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవంబర్ 18న తెల్లవారుజామున 1.01 గంటలకు మృతి చెందాడు.

మృతుడి భార్య మేకల కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ మట్టెడ కుమారస్వామి,లారీ డ్రైవర్ సచిన్ కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ తెలిపారు.

పెన్షనర్ల పెండింగ్ బిల్లులను

వెంటనే మంజూరు చేయాలి

● ప్రతి నెల రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలి
● రాష్ట్ర ప్రభుత్వానికి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రాష్ట్రంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, గజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉద్యోగులు పదవీ విరమణ పొందిన నెల రోజుల్లోపే వారికి రావాల్సిన పెన్షన్ సంబంధిత బిల్లులన్నీ మంజూర య్యేవని తెలిపారు. ప్రస్తుతం మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులు సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ అనంతరం తమకు రావాల్సిన నిధుల కోసం పెన్షనర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు అందుతున్నప్పటికీ, డీఏ బకాయిలు, రెండో పీఆర్సీ అమలు వంటి అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. పెన్షనర్లకు సంబంధించిన అన్ని రకాల బిల్లులను త్వరితగతిన మంజూరు చేయడానికి ప్రతి నెలా రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాలు ప్రత్యేక చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది

అధికారుల పర్యవేక్షణ ఏదీ?



● బెల్ట్‌షాపుల పేరుతో విచ్చలవిడిగా విక్రయాలు..
బీర్, క్వార్టర్‌పై రూ.40 వరకు అదనపు వసూళ్లు?
● యువత భవిష్యత్తు మత్తులోకి.. గొడవలు, రోడ్డు ప్రమాదాలతో గ్రామాల్లో ఆందోళన
● పంచాయతీల తీర్మానాలకు విలువ లేదా? ఎక్సైజ్ శాఖ చర్యలు ఎక్కడ?

జోర్దార్ నిఘా బృందం :మంథని నియోజకవర్గంలోని పల్లెల్లో మద్యం విక్రయాలు నియంత్రణ లేకుండా సాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గ్రామాల్లో గల్లీగల్లీకీ మద్యం అందుబాటులో ఉండటంతో బెల్ట్‌షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ విక్రయాలపై నిఘా పెట్టాల్సిన అధికారులు ఎక్కడున్నారనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

అదనపు వసూళ్లతో మందుబాబుల జేబులకు చిల్లులు!

బీర్, క్వార్టర్ సీసాలపై నిర్ణీత ధరకు మించి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొన్ని వైన్స్‌లలోనూ రూ.5 నుంచి రూ.10 వరకు అధికంగా తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అసలు నిర్ణీత ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? వైన్స్‌ల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం చేరుతున్న తీరు ఏమిటి? ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ తనిఖీలు నిర్వహిస్తోందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యువత భవిష్యత్తుకు మద్యం ముప్పు!

గ్రామీణ ప్రాంతాల్లో యువత మద్యానికి అలవాటుపడుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. మద్యం మత్తులో చిన్నచిన్న విషయాలకే గొడవలు, కుటుంబ కలహాలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులు దెబ్బతినడంతో పాటు యువత విలువైన భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులేనా.. మద్యం విక్రయాల నియంత్రణ ఏదీ?

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే మద్యం విచ్చలవిడిగా అందుబాటులోకి రావడానికి కారణమవుతున్న విక్రయాల నియంత్రణపై ఎక్సైజ్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైనే చర్యలు తీసుకుంటే సరిపోతుందా? అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత లేదా? అని నిలదీస్తున్నారు.

పంచాయతీల తీర్మానాలకు అమలు ఎప్పుడు?

కొన్ని గ్రామపంచాయతీలు ఇప్పటికే మద్యపాన నియంత్రణ, బెల్ట్‌షాపుల నిషేధంపై తీర్మానాలు చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ప్రజల ఆరోగ్యం, గ్రామాల ప్రశాంతత కోసం మిగతా గ్రామపంచాయతీలు కూడా ముందుకొచ్చి తీర్మానాలు చేయాలని కోరుతున్నారు.

వైన్స్‌ల ముందు పార్కింగ్ సమస్య.. ప్రమాదాలకు అవకాశం!

వైన్స్‌ల ముందు ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయడంతో ప్రధాన రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాహనాల రద్దీతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారి వల్ల ప్రమాదాల భయం నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఇప్పటికైనా మేల్కొంటారా?

నేటి యువతే రేపటి సమాజానికి పునాది. అలాంటి యువత మద్యానికి బానిసలైతే గ్రామాల అభివృద్ధి, కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని, మద్యం సీసాలపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధరకు మించి వసూలు చేసే వారిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రశ్న ఒక్కటే..
పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా ఇలాగే కొనసాగుతుందా? లేక అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి గ్రామీణ యువత భవిష్యత్తును కాపాడుతారా?

అగ్నిమాపక శాఖ అధికారి పై ఆరోపణలు

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ అగ్నిమాపక శాఖ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని క్రాకర్స్ అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. ఆయన వైఖరి వల్ల నష్టపోయామని తెలిపారు. నిబంధనలు పాటించకుండా చాంద్‌లో ఒక దుకాణానికి డీఎఫ్‌వో అక్రమంగా అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. వసూళ్లకు పాల్పడ్డారని, అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొంటూ నిబంధనలు



పాటించని క్రాకర్స్ దుకాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలు

● 2 లక్షల నుంచి రూ.2 కోట్ల
● రీజనల్ మేనేజర్ అప్పారావు సూచన

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్‌లోని వేంకటేశ్వర ఆలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సహకారంతో వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మాటోలియా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ అప్పారావు మాట్లాడుతూ వ్యాపారుల అభివృద్ధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు తక్కువ వడ్డీతో వివిధ రకాల రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వ్యాపారులు బ్యాంకు అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.



అనంతసాగర్‌లో చేయూత పింఛన్ల పత్రాల పంపిణీ



● అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
● సర్పంచ్ రామంచ వెన్నెల దయాకర్

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ రామంచ వెన్నెల దయాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వెన్నెల దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు,నేత,గీత కార్మికులు,అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చేయూత పింఛన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పింఛన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు,దివ్యాంగులు, నిరుపేదలు ఆత్మ గౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసా అని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఈ సందర్భంగా సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● షబ్బీర్ అలీ



కామారెడ్డి,జోర్దార్ ప్రతినిధి:బీబీపేట్‌లోని గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ పాల్గొని 206 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. పేదలకు పింఛన్ల ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాత్విక సాయినాథ్,చైర్మన్ సుతారి రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అధికారులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పోస్టర్ల ఆవిష్కరణ


ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఈ నెల 19 నుంచి ప్రారంభ కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఆదిలాబాద్ జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా పథకానికి సంబంధించిన పోస్టర్లను ఎంపీ నగేష్, కలెక్టర్ రాజర్షి బుధవారం ఆవిష్కరించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని వారు ఆదేశించారు.



అధికారుల తీరుపై

ఎంపీ గోడం నగేష్ అసహనం



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:జిల్లాలో నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలు, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని ఎంపీ గోడం నగేష్, చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. దిశ సమావేశంలో అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రొటోకాల్ ప్రకారం గౌరవం కల్పించాలని, అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ ఉన్నారన్న విషయాన్ని మర్చిపోయారా అని అధికారులను ప్రశ్నించారు.

మేక పిల్లకు పాలు ఇస్తున్న ఆవు

అరుదైన దృశ్యం




ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం అనంతపూర్ గ్రామంలో ఓ అరుదైన ఘటన చోటుచేసుకుంది.సిడం జంగుబాపుకు చెందిన పెంపుడు ఆవు పుట్టుకతో బలహీనంగా ఉన్న మేక పిల్లకు పాలు తాగిస్తూ దాని ప్రాణాలను కాపాడుతోంది. కన్నబిడ్డలా మేక పిల్లను లాలిస్తూ పాలు ఇస్తున్న ఆవు దృశ్యం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ అరుదైన ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

సమ్మె అడ్డా

కన్నీళ్లన్నీ కాగడాలై
బాధలన్నీ బావుటాలై
కోపాలన్నీ కొవ్వొత్తులై
ఆవేశాలన్నీ ఎజెండాలై
ఆలోచనలన్నీ జెండాలై
నినదించిన గళాలు
గర్జించిన గొంతుకలు
సేద తీరిన అడ్డా
సమైక్యమైన గడ్డ
సమ్మె అడ్డా..

బానిస బతుకుల గోసల్ని
వెట్టి చాకిరీ వెతల్ని
గట్టి అవమానాల్ని
దశాబ్దాల దరిద్రాన్ని
గుండెల మాటున గాయాల్ని
మనసుల మాటున చింతల్ని
నినాదాల నాదాల్ని
ఉక్రోష ఉద్వేగాల్ని
క్రోడీకరించి..
మేధో మదనాలను
మమేకం చేసి
సమర శంఖం పూరించిన అడ్డా
ఐక్యతా రాగాలు వినిపించిన గడ్డ
సమ్మె అడ్డా..

విభిన్న మనసుల్ని
ఏకం చేసి
విభిన్న ఆలోచనలను
ఒక్కటి చేసి
డెబ్భై ఎనిమిది క్యాడర్లను
సంఘటితం చేసి
దిక్కులు పిక్కటిల్లేలా
సమానత్వ వాదమై
ఆత్మ గౌరవ నాదమై
గర్జించిన అడ్డా
గళమెత్తిన గడ్డ
సమ్మె అడ్డా..



డా. రవాణవేణి ప్రభాకర్
ఆయుష్ మెడికల్ ఆఫీసర్
పెద్దపల్లి.

దళిత బంధు లబ్ధిదారులకు పింఛన్లు అందని పరిస్థితి!

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:దళిత బంధు పథకం ద్వారా ఆర్థిక సాయం పొందిన కుటుంబాలకు కొత్తగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం అందడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో దళిత బంధు కింద రూ.10 లక్షల సాయం పొందిన వారికి ఐదేళ్ల వరకు ఇతర ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించరాదనే నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.దళిత బంధు పథకాన్ని అప్పటి ప్రభుత్వం హుజురాబాద్ కేంద్రంగా ప్రారంభించడంతో రాష్ట్రంలోనే అత్యధిక మంది ఈ నియోజకవర్గంలో లబ్ధి పొందారు. ప్రస్తుతం ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్లు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో అర్హత ఉన్నప్పటికీ తమకు అవకాశం దక్కడం లేదని పలువురు దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దళిత బంధు లబ్ధిదారుల జాబితాను ప్రస్తుతం హోల్డ్‌లో ఉంచామని, ఈ విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నట్లు సమాచారం. పింఛన్ల ఎంపిక ప్రక్రియ మళ్లీ ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితుల్లో అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

సైబర్ భద్రతపై డా. బండెల విష్ణువర్ధన్ రచించిన పుస్తకం ఆవిష్కరణ

- కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ ప్రా. కర్నాటి ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ
- పరిశోధకులు, విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవనున్న గ్రంథం



వరంగల్, జోర్దార్ ప్రతినిధి:డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంతోపాటు సాంకేతిక భద్రతపై అవగాహన పెంపొందించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, పరిశోధకులు డా. బండెల విష్ణువర్ధన్ రచించిన “సైబర్ సెక్యూరిటీ మరియు సైబర్ నేర పరిశోధన పునాదులు” పుస్తకాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కర్నాటి ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు.

ఆరు విభాగాల్లో సైబర్ భద్రత అంశాలు

ఈ పుస్తకం ఆరు విభాగాలుగా రూపొందించబడింది. కంప్యూటర్ నెట్‌వర్క్‌లు, వైర్డ్ అండ్ వైర్‌లెస్ లాన్ వ్యవస్థలు, నెట్‌వర్క్ భద్రతా చట్టాలు, క్రిప్టోగ్రఫీ, యాక్సెస్ మేనేజ్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, వైర్‌లెస్ పరికరాల్లోని భద్రతా లోపాలు తదితర కీలక అంశాలను ఇందులో వివరించారు.సంస్థాగత సమాచార భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు, సైబర్ నేరాల స్వరూపం, వాటి పరిశోధనకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై పుస్తకం అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు.

సైబర్ భద్రతపై పరిశోధనలు పెరగాలి: వీసీ

ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ. కర్నాటి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరాలు నిత్యజీవితంలో భాగమవుతున్నాయని, వ్యక్తులు, సంస్థలు సైబర్ దాడుల నుంచి తమ సమాచారాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ భద్రత రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు.విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ. వల్లూరి రామచంద్రం, ఓఎస్డీ సైన్స్ వెంకట్రామిరెడ్డి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్, ఈసీ సభ్యులు, సామాజిక శాస్త్రాల విభాగం డీన్ ప్రొ. సురేష్ లాల్, డా. మంజుల తదితరులు పుస్తకాన్ని అభినందించారు. సైబర్ భద్రతలోని సాంకేతిక మెళకువలను తెలుసుకోవాలనుకునే విద్యార్థులు, పరిశోధకులు, నిపుణులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. వేణుగోపాల్ రెడ్డి, ఈసీ సభ్యులు చిర్ర రాజు గౌడ్, అధ్యాపకులు రవి ప్రసాద్, మంద భాస్కర్, డా. పంతగాని చందు, గుండు రాజేష్, కుమ్మరి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో దరియాపూర్ టీజీ మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా!

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక
- విష్ణుసాయి, వర్షిత్‌కు అభినందనల వెల్లువ

ముత్తారం, జోర్దార్ ప్రతినిధి:చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ దరియాపూర్ టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు విజయపథంలో దూసుకెళుతున్నారు. పెద్దపల్లి జిల్లా స్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఇద్దరు విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, ముత్తారం మండలానికి గర్వకారణంగా నిలిచారు.

జిల్లా స్థాయి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయికి..

అండర్-14 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి చిప్ప విష్ణుసాయి, అండర్-17 విభాగంలో పదో తరగతి విద్యార్థి శ్రీ వర్షిత్ తమ ఆటతీరుతో ప్రతిభను నిరూపించుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి తదుపరి స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

విద్యార్థులకు ప్రముఖుల అభినందనలు

ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై మండల విద్యాశాఖ అధికారి హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ రాపల్లి రాజయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, రాబోయే పోటీల్లోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రేవ్ పార్టీలో పాల్గొని క్రమశిక్షణను ఉల్లంఘించిన ఐదుగురు పోలీసు సిబ్బందిని హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్

- మరో 9 మందిపై శాఖా పరమైన చర్యలు.
- రామగుండం పోలీస్ కమిషనర్, అంబర్ కిషోర్ ఝా.



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు పోలీస్ సిబ్బంది, ఇటీవల విధులు నిర్వహిస్తున్న సమయంలోనే, బాధ్యతలను విస్మరించి, పుట్టినరోజు వేడుకలకు హాజరై మద్యం సేవించి, మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో, పోలీస్ శాఖ క్రమశిక్షణకు, ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారనీ, ఈ ఘటనపై స్పందించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐదుగురు సిబ్బందిని పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ,మరో 9 మంది సిబ్బంది పై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సిబ్బందికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

పోలీస్ శాఖలో క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతమైన విధి నిర్వహణ అత్యంత కీలకమని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం ఏమాత్రం సహించరాని విషయమని పేర్కొన్నారు.

ప్రతి పోలీస్, శాఖ గౌరవ ప్రతిష్టలను కాపాడేలా వృత్తిపరమైన నిబద్ధతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణ ఉల్లంఘన, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు గడువు 60 రోజుల నుంచి 30 రోజులకు కుదింపు

- నవంబర్ 19 నుంచి కొత్త నిబంధనలు అమలు
- గడువులోగా రిజర్వేషన్ బిడ్డింగ్ చెల్లింపులు పూర్తి చేయాలి

హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:వాహనాలకు ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్లను పొందే గడువును తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ 60 రోజుల నుంచి 30 రోజులకు కుదించింది.ఈ నూతన నిబంధనలు నవంబర్ 19, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి.ఈ మేరకు రవాణా శాఖ వాహన యజమానులకు కీలక సూచనలు జారీ చేసింది.

ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్లు పొందాలనుకునే వాహన యజమానులు తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) జారీ చేసిన తేదీ నుంచి 30 రోజులలోపు నంబర్ రిజర్వేషన్,బిడ్డింగ్, అవసరమైన రుసుము చెల్లింపు ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుందని, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయని పక్షంలో సంబంధిత వాహనానికి రవాణా శాఖ యాదృచ్ఛికంగా రిజిస్ట్రేషన్ నంబర్‌ను కేటాయించనుంది.ఈ నిబంధనల మార్పు గురించి వాహనాల కొనుగోలు సమయంలోనే డీలర్లు వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలని రవాణా శాఖ సూచించింది. ఫ్యాన్సీ నంబర్ పొందాలనుకునే వారు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా నిర్ణీత 30 రోజుల గడువులోనే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపింది.

ఈ నూతన విధానానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం వాహన యజమానులు తమ సమీపంలోని ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని (ఆర్‌టీఏ) సంప్రదించాలని రవాణా శాఖ సూచించింది.

మహిళల అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



- అత్యవసర పరిస్థితుల్లో 112,109 నంబర్లకు ఫోన్ చేయాలి
- ఎస్ఐ రావుప్

వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మోహరా ఆదేశాల మేరకు మర్పల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలలో మహిళల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ రావుప్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా సమాజంలో ప్రమాదకర సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులను అక్రమంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించి వెట్టి చాకిరీ, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలకు బలవంతం చేస్తున్నారని తెలిపారు. మధ్యవర్తులు డబ్బు సంపాదించేందుకు మహిళలను చిత్రహింసలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల అక్రమ రవాణాను అరికట్టాలంటే విద్యార్థులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల బారిన పడినా, మహిళల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 లేదా 109 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల రక్షణ పొందాలని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే. రాధిక, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



- 'బతుకమ్మ ఆటపాటలతో ఆసుపత్రి కార్మికుల వినూత్న నిరసన

కామారెడ్డి,జోర్దార్ ప్రతినిధి:కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆటపాటలతో వినూత్న నిరసన చేపట్టారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, జిల్లా ఆసుపత్రిని 1,000 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి. బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎల్. దశరథ్, ఎం. ప్రవీణ్, కే. శ్రీనివాస్,ఎం.డి. రఫీక్ తదితరులు, కార్మికులు పాల్గొన్నారు.

సాంస్కృతిక జానపద గిరిజన నృత్యాలతో అలరించిన విద్యార్థులు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా సాగాయి.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక,జానపద, స్థానిక గిరిజన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా స్థానిక గిరిజన సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. యువతలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడంతో పాటు భారతీయ సంస్కృతి,సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి యువజన ఉత్సవాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి రోడ్డెక్కిన విద్యార్థినులు

కాంగ్రెస్ సర్కార్ హయాంలో రైతులు, ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు రేవంత్ సర్కార్‌లో విద్యార్థులకూ కష్టాలు తప్పడం లేదు. స్కాలర్ షిప్స్ విడుదల చేయాలంటూ విద్యార్థులంతా కదం తొక్కారు.ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని విద్యార్థినులు ఎల్బీ స్టేడియం వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఇదేం రాజ్యం ఇదేం రాజ్యం.. ప్రభుత్వం తక్షణేమ స్కాలర్ షిప్ వెంటనే రిలీజ్ చేయాలి..అంటూ నినాదాలు చేశారు, విద్యార్థినులంతా పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలు దేరడంతో ఎల్బీ స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి



హుజురాబాద్ క్లబ్ విజేతలకు సన్మానం



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో విజయం సాధించిన కార్యదర్శి కట్కూరి మల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కేసిరెడ్డి నర్సింహారెడ్డి, గడ్డం ధర్మారెడ్డిలను తెలంగాణ కమర్షియల్,
ట్యాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ బుధవారం సాయంత్రం స్థానిక క్లబ్‌లో ఘనంగా సన్మానించారు.
35 ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న ముగ్గురు క్లబ్ ఎన్నికల్లో విజయం సాధించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

గణిత,భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

వరంగల్,జోర్దార్ ప్రతినిధి:సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ,జిల్లా పరిషత్,కేజీబీవీ,మోడల్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్న గణిత,భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి బి. మహేష్ నాయక్ తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు నర్సంపేటలోని బిట్స్ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు.ఈ శిక్షణలో భాగంగా గణిత ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై రెండు రోజులు, ఖాన్ అకాడమీపై ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ అభ్యసన వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో సమ ర్థవంతంగా వినియోగించుకునే విధంగా ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు మెరుగుపడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆయన ఆకాంక్షించారు.

ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

- వోడితల ప్రణవ్ పిలుపు


హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:సిద్దిపేటలో నిర్వహించనున్న ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభోత్సవం, ఇందిరమ్మ చీరల పంపిణీకార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వోడితల ప్రణవ్ కోరారు.
ఈ కార్యక్రమంలో వోడితల ప్రణవ్ పాల్గొననున్న నేపథ్యంలో నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమానికి వెళ్లేందుకు అన్ని మండల,పట్టణ కేంద్రాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు సిద్దిపేటకు ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

విద్యుత్ తీగలు తెగిపడటంతో అప్రమత్తమైన గ్రామస్తులు తప్పిన పెను ప్రమాదం

భీమారం,జోర్దార్ ప్రతినిధి:గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ లోగల భీమారం గ్రామపంచాయతీ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడటంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే స్పందించి పెను ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.విద్యుత్ తీగలు తెగిపడిన విషయాన్ని గమనించిన ఆకుల కుమార్,బూర రామకృష్ణ, బేతల్లి యాకయ్యలు ప్రమాదం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేశారు.వెంటనే సంబంధిత విద్యుత్ లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.దీంతో విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు.వీరు సమయస్ఫూర్తితో వ్యవహరించి విద్యుత్ ప్రమాదం జరగకుండా చూడటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తంగా వ్యవహరించి ప్రజల ప్రాణాలను కాపాడిన వారిని స్థానికులు అభినందించారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల చెక్కును అందించిన యూనియన్ బ్యాంకు ప్రతినిధులు



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడి కుటుంబానికి, బెల్లంపల్లి యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు బుధవారం కోటి రూపాయల చెక్కును అందించారు.
బెల్లంపల్లి స్టేషన్ రోడ్ కాలనీలో నివాసముంటూ, కాసిపేట గనిలో జనరల్ మజ్దూర్ గా పని చేస్తున్న పులి మూర్తి, గత సంవత్సరం లక్సెట్టిపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఇతను బెల్లంపల్లి యూనియన్ బ్యాంకులో సాలరీ అకౌంట్ కలిగి ఉండడంతో బ్యాంకు అధికారులు ఇన్సూరెన్స్ డబ్బులను బుధవారం బ్యాంకులో చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు (హైదరాబాద్),డీజీఎం నటరాజన్ (కరీంనగర్),బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ చందన్ కుమార్,లు నామినీలుగా వున్న మూర్తి భార్య పులి జోత్స్న, తల్లి అనసూర్య లకు ఈ చెక్కు అందజేశారు.
ఈ సందర్భంగా సిజిఎం రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు ఇన్సూరెన్స్ చేసుకొని ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండలానికి చెందిన సూరోజు వేణుగోపాల్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60 వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చొరవతో మంజూరైన చెక్కును యూత్ నాయకుడు మండల అనిల్ కుమార్ రెడ్డి, ఏలుబాక సదయ్య, అడిగొప్పుల వెంకన్న కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల ఆత్మరక్షణకు ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ

- మూడు నెలల పాటు శిక్షణ

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి,ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేలా విద్యాశాఖ కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది.సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లాలోని 81 ప్రభుత్వ, స్థానిక ఉన్నత, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో శిక్షణ అందిస్తున్నారు. అదనంగా 30 గిరిజన ఆశ్రమోన్నత బాలికల పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.
ఎంపిక చేసిన శిక్షకులు వారంలో మూడు రోజుల పాటు పాఠశాల సమయాల్లో విద్యార్థినులకు



ఆత్మరక్షణ నైపు ణ్యాలను నేర్పిస్తున్నారు.మూడు నెలల పాటు కొన సాగే ఈ శిక్షణకు శిక్షకులకు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నారు.

కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ

కరాటే శిక్షణ నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ప్రధానోపా ధ్యాయులు, పీఈటీలు, పీడీలు శిక్షణ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని జీసీడీఈ సరిత తెలిపారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి: డీఈఓ మాధవి

బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో రాణించాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు.కరాటే శిక్షణ వారి భద్రతకు, స్వీయ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను అలవర్చుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి బాలిక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయక తప్పదు



- వాసిరెడ్డి సీతారామయ్య.

మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, నిరాహార దీక్షలు, ధర్నాలు, సమ్మెలు, పోరాటాలు, చేయక తప్పదని, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు.
బుధవారం శ్రీరాంపూర్ జిఎం కార్యాలయం ముందు చేపట్టిన రెండు రోజుల నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా హాజరైన సీతారామయ్య మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల మెడికల్ బోర్డును ప్రతి నెల నిర్వహించాలని, సిసిఎల్ వద్ద ఒప్పందం చేసుకున్న 24 డిమాండ్స్, కొత్త గనుల ఏర్పాటు, ప్రభుత్వ విద్యుత్ సంస్థల నుండి రావలసిన 60 వేల కోట్ల బకాయిల సాధనకై నిరాహార దీక్ష నిర్వహిస్తున్నామని, కార్మికుల సమస్యల పరిష్కార ం అయ్యేవరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు పిట్ కార్యదర్శిలు, సింగరేణి కార్మి కులు, పాల్గొన్నారు.

బొగ్గు గని పెన్షనర్ల సమస్యలను 12వ పేజీ బోర్డు డిమాండ్లలో చేర్చాలి




- జాతీయ కార్మిక సంఘాలకు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుల విజ్ఞప్తి.

మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:బొగ్గుగని పెన్షనర్ల సమస్యలను 12వ వేజ్ బోర్డు డిమాండ్ల లో చేర్చాలని, జాతీయ కార్మిక సంఘాల నాయకులకు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం విజ్ఞప్తి చేశారు.
బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ,
బొగ్గు గని కార్మికుల వేతన సవరణకు సంబంధించిన 12వ వేజ్ బోర్డు డిమాండ్లలో బొగ్గు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను కోల్ ఇండియా యజమాన్యానికి సమర్పించే, డిమాండ్లలో చేర్చాలని, 1998 లో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని ఒప్పందం ఉన్నా ,గత 28 సంవత్సరాలుగా ఒక శాతం కూడా పెన్షన్ పెంచకపోవడంవల్ల 84 వేల సింగరేణి విశ్రాంతి ఉద్యోగులు, కోల్ ఇండియా వ్యాప్తంగా 5 లక్షల పైచిలుకు మంది, దుర్భర పరిస్థితుల్లో చాలీచాలని పెన్షన్ తో జీవితాలను వెల్ల దీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసినారు.
ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న ఆసరా పెన్షన్ల కన్నా, తక్కువ పెన్షన్ పొందుతున్నారని,1998 లో చేసుకున్నా విశ్రాంత బొగ్గు గని కార్మికుల పెన్షన్ అగ్రిమెంట్ ను సవరించాలని, కరుబత్యంతో కూడిన 50 శాతం పెన్షన్ పెంచాలనే డిమాండును 12 వ వేజ్ బోర్డు లో కోల్ ఇండియా యజమాన్యాన్ని డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.కనీస బొగ్గు పెన్షన్ రూ 15 వేలుగా నిర్ణయించాలని,(సి పిఎం ఆర్ఎస్) హెల్త్ కార్డ్ సంబంధించి అధికారులకు ఇచ్చినట్లే, విశ్రాంత ఉద్యోగులకు 25 లక్షల వరకు వైద్యం అందించాలని, పెరిగిన గ్రాట్యుటీ సీలింగ్ 2016 నుండే 20 లక్షలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సమావేశంలో అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, ఎం అంజయ్య, శశాంకారావు, పోతరాజుల చంద్రయ్య, చెల్లా రాజిరెడ్డి, నల్లతీగల ఓదెలు,ఇందూరి రామన్న, ఎల్, శంకర్ రావు, మోత్కూరి రాంబాబు,మచ్చ రాజేశ్వర్ రావు, ముత్యం గంగాధర్, కె, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పొన్నేకల్ వద్ద మినీ వ్యాన్ బోల్తా

ఖమ్మం రూరల్,:ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో లాజిస్టిక్స్ వ్యాన్ బుధవారం ఉదయం బోల్తా పడింది. హైదరాబాద్ నుండి ఖమ్మం వస్తున్న అశోక్ లే ల్యాండ్ లాజిస్టిక్స్ మినీ వ్యాన్ ను తల్లంపాడు దాటిన తర్వాత వెనక నుండి గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లింది. దీంతో రన్నింగ్ లో వ్యాన్ ఒక్కసారిగా సెంట్రల్ డివైడర్ కి ఢీకొని బోల్తా పడింది. వ్యాన్ ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. అదృష్టవశాత్తూ డ్రైవర్ క్లీనర్



స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే హైవే పెట్రోలింగ్ ఇన్‌చార్జి మహేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు

మోడల్ స్కూల్ లలో ఆర్ట్ టీచర్ పోస్టులకు టీసిసి చేసిన వారికి అర్హత కల్పించాలి



- బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ అభ్యర్థులకే అవకాశం కల్పించడంపై అభ్యంతరం
- గతంలో గురుకుల నియామకాల్లో టీసీసీ అభ్యర్థులకు అవకాశం
- తమకూ అర్హత కల్పించాలని నిరుద్యోగ ఆర్ట్ టీచర్ల డిమాండ్

(కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి)ప్రభుత్వం మోడల్ స్కూళ్లలో ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో టెక్నికల్ టీచర్స్ కోర్సు (టీసీసీ) పూర్తి చేసిన అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించాలని ఆర్ట్ విద్యలో శిక్షణ పొందిన నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ విధానంలో కరీంనగర్ జిల్లాలో వారధి సొసైటీ ఆధ్వర్యంలో ఆర్ట్ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఈ పోస్టులకు బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ అర్హతలు కలిగిన అభ్యర్థులనే ఎంపిక చేయనున్నట్లు ప్రకటించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో గురుకులాల్లో అవకాశం.. ఇప్పుడు ఎందుకు నిరాకరణ?

గతంలో గురుకుల విద్యాసంస్థల్లో ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీ సమయంలో టెక్నికల్ టీచర్స్ కోర్సులో ఆర్ట్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన అభ్యర్థులకు కూడా అర్హత కల్పించారు. వారికి పరీక్ష నిర్వహించి నియామక ప్రక్రియ చేపట్టిన సందర్భాలు ఉన్నాయని నిరుద్యోగులు గుర్తుచేస్తున్నారు. గతంలో ఒకే విద్యారంగానికి చెందిన టీసీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించినప్పుడు, ప్రస్తుతం మోడల్ స్కూళ్లలో ఆర్ట్ టీచర్ పోస్టులకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.
కరీంనగర్ జిల్లాలో ప్రకటించిన పోస్టులకు అవసరమైన బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ అర్హత కలిగిన అభ్యర్థులు తగిన సంఖ్యలో అందుబాటులో లేరని టీసీసీ పూర్తి చేసిన నిరుద్యోగులు పేర్కొంటున్నారు. మరోవైపు ఆర్ట్ ఎడ్యుకేషన్ లో ప్రత్యేక శిక్షణ పొందిన టీసీసీ అభ్యర్థులు ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని చెబుతున్నారు.

నిబంధనల్లో మార్పులు చేయాలి

టీసీసీలో ఆర్ట్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన వారికి కూడా అర్హత కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అవసరమైతే టీసీసీ అభ్యర్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయాలని సూచిస్తున్నారు.

పోస్టులు ఖాళీగా ఉండొద్దు.. అర్హులకు అన్యాయం జరగొద్దు!

ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో కళా విద్యకు ప్రాధాన్యత పెంచాల్సిన అవసరం ఉండగా, మరోవైపు సంబంధిత కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. గతంలో గురుకుల నియామకాల్లో అనుసరించిన విధానాన్ని పరిగణనలోకి తీసుకొని మోడల్ స్కూల్ ఆర్ట్ టీచర్ పోస్టులకు కూడా టీసీసీ ఆర్ట్ ఎడ్యుకేషన్ అభ్యర్థులను అర్హులుగా గుర్తించాలని కోరుతున్నారు. ప్రభుత్వం, వారధి సొసైటీ అధికారులు ఈ అంశంపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆత్మీయతల నడుమ శంకేసి రవీందర్-రజిత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు!



రామగిరి జోర్దార్ ప్రతినిధి: రామగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంకేసి రవీందర్--రజిత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ మండల అధ్యక్షుడు పూదరి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవీందర్--రజిత దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షిం చారు. ఆత్మీయులు, పార్టీ నాయకులు, స్నేహితుల మధ్య వేడుకలు ఆనందోత్సాహాల నడుమ సాగాయి.ఈ కార్యక్రమంలో సెంటినరీ కాలనీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కాపుర బోయిన భాస్కర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రొడ్డ శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల అశోక్, ఏలుపుల కుమార్, కలవేన సదానందం, బండి మహేందర్, దామెర శ్రీనివాస్, దాడి కృష్ణ, బత్తిని ప్రశాంత్, శంకేసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది ఆటగాళ్లు ఔట్.. రూ.41.65 కోట్లతో వేలానికి కోల్‌కతా..!



మూడు సార్లు ఐపీఎల్ టైటిల్ సాధించిన కోల్‌కతా నైట్‌రైడర్స్.. 2027 సీజన్ కోసం జట్టులో భారీ మార్పులు చేసింది. శ్రీలంక పేసర్ మతీష పతిరణను రూ.18 కోట్లకు, బంగ్లాదేశ్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రూ.9.20 కోట్లకు గతంలో తీసుకున్న కేకేఆర్.. ఇప్పుడు ఇద్దరినీ విడుదల చేసింది. ఈ ఇద్దరి విడుదలతోనే రూ.27.20 కోట్ల మొత్తం పర్స్‌లో అందుబాటులోకి రానుంది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రకు కూడా జట్టు వీడ్కోలు పలికింది. 2026 సీజన్‌లో అతడికి ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు .వీరితో పాటు అజింక్య రహానే, ఆకాష్ దీప్, నవదీప్ సైనీ, రాహుల్ త్రిపాఠి, ఉమ్రాన్ మాలిక్ తదితరులను కూడా విడుదల చేసింది. కామెరాన్ గ్రీన్‌కు మరో అవకాశం..

ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను మాత్రం కేకేఆర్ కొనసాగించింది. గత వేలంలో అతడి కోసం ఏకంగా రూ.25.20 కోట్లు ఖర్చు చేసింది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ షెడ్యూల్ బిజీగా ఉండటంతో అతడి అందుబాటుపై సందేహాలు ఉన్నప్పటికీ ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకుంది.కేకేఆర్ హెడ్ కోచ్ అభిషేక్ నాయర్ మాట్లాడుతూ.. రిటెన్షన్ సమయంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవడం సహజమే అయినా, రాబోయే సీజన్‌లో జట్టు ఫలితాలను ప్రభావితం చేయగల ఆటగాళ్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని వివరించారు.

భారత ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి..క్రికెట్ స్ట్రాటజీ హెడ్ ర్యాన్ టెన్ డోషేట్ కూడా భారత ఆటగాళ్లను కొనసాగించడంపై మాట్లాడారు. రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, రమణ్‌దీప్ సింగ్ వంటి అనుభవం ఉన్న ఆటగాళ్లతో పాటు గత సీజన్‌లో రాణించిన కార్తీక్ త్యాగి, సౌరభ్ దూబేలను కూడా జట్టులో ఉంచినట్లు తెలిపారుఅనుభవం ఉన్న ఆటగాళ్లు, భవిష్యత్తులో మంచి ప్రదర్శన చేసే సామర్థ్యం ఉన్న యువ ఆటగాళ్ల కలయికతో జట్టును సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏడాదికి 4 సార్లు ఉచితంగా సిబిల్ స్కోర్ రిపోర్ట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.. చాలా సింపుల్..



మీకు బ్యాంక్ నుంచి రుణాలు రావాలన్నా, క్రెడిట్ కార్డులు మొత్తం నాలుగు క్రెడిట్ బ్యూరోలు రిపోర్ట్ అందిస్తున్నాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్, సిఆర్ఐఎఫ్ హై మార్క్ రిపోర్ట్ సేవలను అందిస్తున్నాయి. మీరు ఒక్కో సంస్థను నుంచి ఒకసారి రిపోర్ట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు. దీని వల్ల నాలుగు సార్లు ఫ్రీగా క్రెడిట్ స్కోర్ తనిఖీ చేసుకోవచ్చు.ఆన్‌లైన్‌లో ఉచిత క్రెడిట్ రిపోర్ట్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..?

-- సిబిల్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి
-- మీ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అవ్వండి. ఇప్పటివరకు అకౌంట్ లేకపోతే ముందుగా ఖాతా సృష్టించుకోండి
-మీ ఇమెయిల్, మొబైల్ నంబర్, ఇతర అవసరమైన సమాచారాన్ని అందించండి
-మీ మొబైల్‌కు వచ్చిన ఓ్కాని నమోదు చేయండి
-అక్కడ మీ క్రెడిట్ రిపోర్ట్ చూడటంతోట పాటు డౌన్ లోడ్ కూడా చేసుకోవచ్చు
-ఎక్స్పీరియన్, ఈక్విఫాక్స్, జ=xఖీ హై మార్క్ లాంటి వెబ్ సైట్ల నుంచి కూడా ఇదే తరహాలో చూసుకోవచ్చు

హార్షల్ ఇన్.. షారుఖ్ ఔట్.. గుజరాత్ టైటాన్స్ రిటెన్షన్ పూర్తి జాబితా ఇదే..!

ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న జట్టే చరిత్ర సృష్టిస్తుంది. గుజరాత్ టైటాన్స్ సరిగ్గా అదే చేసింది. నవంబర్ 17, రిటెన్షన్ గడువు ముగిసిన రోజున +ు యాజమాన్యం ఎలాంటి భావోద్వేగాలకు తావు ఇవ్వలేదు. కేవలం లెక్కలు, ఫామ్, భవిష్యత్ అవసరాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఫైనల్ ఓటమి ఇంకా అభిమానుల గుండెల్లో మంటగానే ఉంది. 732 పరుగులతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, 722 పరుగులతో సాయి సుదర్శన్ ఆ సీజన్‌ను ఏకచ్ఛత్రాధిపత్యంతో ఏలారు. జోస్ బట్లర్ దూకుడు, రషీద్ ఖాన్ మాయాజాలం, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కగిసో రబాడా పేస్ త్రయం.. ఇలా విజేత జట్టుకు కావాల్సిన అన్ని అస్త్రాలు ఉన్నా, కీలక సమయంలో ఫినిషింగ్ లోపించింది. అందుకే ఈసారి +ు కత్తిని ఫినిషర్లపైనే ఝుళిపించింది.

షారుఖ్ ఖాన్‌కు షాక్ -- ఎందుకీ నిర్ణయం?

జట్టు నుంచి రిలీజ్ అయిన జాబితాలో అతిపెద్ద పేరు షారుఖ్ ఖాన్. గత ఏడాది రూ.4 కోట్ల భారీ ధరతో జట్టులోకి వచ్చిన ఈ తమిళనాడు పవర్-హిట్టర్, 2026 సీజన్ మొత్తంలో కేవలం 43 పరుగులకే పరిమితమయ్యాడు. ఫినిషర్‌గా కోట్ల రూపాయలు తీసుకుని, జట్టును గెలిపించలేకపోతే ఏ ఫ్రాంచైజీ ఉంచుకుంటుంది? క్రికెట్‌లో సెంటిమెంట్‌కు చోటు లేదని +ు మరోసారి నిరూపించింది. అతడితో పాటు ఒక్క మ్యాచ్ కూడా ఆడని అనుభవజ్ఞుడు ఇషాంత్ శర్మ (రూ.75 లక్షలు), పృథ్వీరాజ్ యర్రాలను రిలీజ్ చేసింది.ఐదుగురి రిలీజ్ ద్వారా దాదాపు రూ.6.55 కోట్లు ఆదా చేసిన +ు, ఇప్పుడు మొత్తం రూ.8.75 కోట్ల ఎడిసెంబర్ 16న గోవాలో జరగనున్న మినీ వేలానికి వెళ్తోంది.

కోర్ టీమ్‌కు ఢోకా లేదు -- 22 మంది సేఫ్..!

రిలీజ్‌లో కఠినంగా వ్యవహరించిన +ు, రిటెన్షన్‌లో మాత్రం నమ్మకాన్ని నిలబెట్టుకుంది. మొత్తం 22 మందిని అట్టిపెట్టుకుంది. ఇది సాధారణ నిర్ణయం కాదు. రన్నరప్ జట్టును చెదరగొట్టకుండా, అవసరమైన చోట మాత్రమే సర్జరీ చేయడం అనుభవజ్ఞుల లక్షణం.కెప్టెన్ గిల్, సాయి సుదర్శన్, బట్లర్ టాప్ ఆర్డర్‌కు తిరుగులేదు. మిడిల్ ఆర్డర్‌లో గుజరాత్ గుండె చప్పుడు అయిన రాహుల్ తెవాటియాను ఉంచుకోవడం అభిమానులకు ఊరట. గతంలో ఎన్నో మ్యాచ్‌లను ఒంటి చేత్తో



గెలిపించిన తెవాటియాపై మేనేజ్‌మెంట్‌కు ఇంకా నమ్మకం పోలేదని అర్థమవుతోంది. అలాగే స్పిన్ ఆల్‌రౌండర్ ఆర్. సాయి కిషోర్, పేస్ సంచలనం అశోక్ శర్మను కొనసాగించడం +ు భవిష్యత్తుకు భరోసా. వాషింగ్టన్ సుందర్, గ్లెన్ ఫిలిప్స్, జేసన్ హోల్డర్ వంటి ఆల్‌రౌండర్ల బలగం, రషీద్, రబాడా, సిరాజ్ బౌలింగ్ దళం చెక్కుచెదరలేదు.

అసలు మాస్టర్ స్ట్రోక్: హర్షల్ పటేల్ ట్రేడ్..!

రిటెన్షన్ డెడ్‌లైన్‌కు కొన్ని గంటల ముందు +ు వేసిన ఎత్తుగడ అందరినీ ఆశ్చర్యపరిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి రెండుసార్లు పర్పుల్ క్యాప్ విజేత హర్షల్ పటేల్‌ను ఆల్-క్యాష్ డీల్‌లో జట్టులోకి తెచ్చుకుంది. విశేషం ఏంటంటే, గత ఏడాది ా=ా రూ.8 కోట్లకు కొన్న హర్షల్, +ుకి మాత్రం రూ.4 కోట్లకే దక్కాడు. 50% తక్కువ ధరకు డెత్ ఓవర్ల స్పెషలిస్టును దక్కించుకోవడం నిజంగా చాణక్యమే. సిరాజ్-రబాడా-ప్రసిద్ధ్ పేస్ దళంలోకి హర్షల్ రాకతో +ు డెత్ బౌలింగ్ మరింత పదును తేలనుంది.రిటైన్ చేసిన 22 మంది: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్, టామ్ బాంటన్, అనుజ్ రావత్, కుమార్ కుషాగ్ర, గ్లెన్ ఫిలిప్స్, జేసన్ హోల్డర్, నిషాంత్ సింధు, రాహుల్ తెవాటియా, ఆర్. సాయి కిషోర్, వాషింగ్టన్ సుందర్, కగిసో రబాడా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ ఖాన్, హర్షల్ పటేల్ (ట్రేడ్), అర్షద్ ఖాన్, అశోక్ శర్మ, గుర్నూర్ బ్రార్, మానవ్ సుతార్, జయంత్ యాదవ్

ధంతేరస్ రోజున బంగారం, వెండి కొంటున్నారా.. ఈ టైమ్ మిస్ కావొద్దు.

ప్రతి సంవత్సరం దీపావళికి ముందు వచ్చే ధంతేరస్ రోజున బంగారం కొంటే మంచిదని చాలామంది నమ్ముతారు. ఈ ఏడాది నవంబర్ 8వ తేదీన దీపావళి వస్తుండగా.. నవంబర్ 6న శుక్రవారం ధంతేరస్ వస్తుంది. లక్ష్మీదేవి, కుబేరుడికి ఈ పండుగను అంకితం చేశారు. దీంతో నవంబర్ 6న బంగారం కొంటే శుభం జరుగుతుందని, సంపద, ఆరోగ్యం, శ్రేయస్సు కలుగుతుందని బాగా నమ్ముతారు. ముఖ్యంగా స్త్రీలు ఈ రోజున బంగారం కొనుగోలు చేయడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటారు. ధంతేరస్ రోజున బంగారం కొనుగోలు చేయడానికి మంచి ముహూర్తం ఏంటనేది ముందే తెలుసుకుంటారు. ఆ సమయానికి వెళ్లి బంగారం, సిల్వర్ లాంటివి కొనుగోలు చేసే సాంప్రదాయం దేశంలో కొనసాగుతోంది. ఈ క్రమంలో ధంతేరస్ రోజున బంగారం కొనుగోలు చేయడానికి మంచి సమయం ఏంటనేది తెలుసుకుందాం.హైదరాబాద్‌లో మంచి సమయం ఇదే..ధంతేరస్ రోజున బంగారం, వెండి కొంటే శ్రేయస్సు, సమృద్ధి, అదృష్టం కలుగుతుందనే నమ్మకం చాలామందిలో ఉంటుంది. ఈ రోజున బంగారు ఆభరణాలు, నాణెలు లేదా వెండి పాత్రలు, ఇతర విలువైన లోహాలను కొనుగోలు చేసే సాంప్రదాయం ఇప్పటికీ ఉంది. కొనుగోలు చేసిన వస్తువులను పూజ గదిలో పెట్టి పూజలు నిర్వహిస్తారు. ఈ రోజున బంగారం, వెండి కొనుగోలు చేసేందుకు మంచి సమయం, ముహూర్తం ఏంటనేది ముందే పండితుల ద్వారా తెలుసుకుని తమ కొనుగోళ్లను ప్లాన్ చేసుకుంటారు. అయితే మంచి సమయాలు అనేవి ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. హైదరాబాద్ విషయానికొస్తే.. నవంబర్ 6న ఉదయం 10.30 గంటల



తర్వాత ఎప్పుడైనా బంగారం కొనుగోలు చేసేందుకు మంచి సమయమని పండితులు చెబుతున్నాయి. అయితే సాయంత్రం 6.15 గంటల నుంచి 8.13 గంటల వరకు మధ్య కొనుగోలు చేస్తే మరింత మంచిదని అంటున్నారు. సాయంత్రం షాపుల్లో ఎక్కువ జనం రద్దీ ఉంటుంది గనుక ఉదయం 10.30 గంటల తర్వాత ఎప్పుడైనా కొనుగోలు చేయవచ్చని సూచిస్తున్నారు.ఈ వస్తువులను కూడా కొనుగోలు చేసే సాంప్రదాయం ఇక ధంతేరస్ రోజున బంగారం, వెండితో పాటు ఇత్తడి, రాగి, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. కొత్తగా కొన్న

ఎప్పటికీ మా తలా నువ్వే".. ధోనీకి సహచరుల భావోద్వేగ వీడ్కోలు..!

భారత క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రయాణానికి ముగింపు పలికాడు. చెన్నై సూపర్ కింగ్స్ మంగళవారం ధోనీని ఐపీఎల్ 2027 నుంచి టీమ్ మెంటార్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో 2008లో ప్రారంభమైన అతడి ఐపీఎల్ ఆటగాడి ప్రయాణం ముగిసినట్లయింది.ఈ ప్రకటన వెలువడిన వెంటనే పలువురు క్రికెటర్లు, మాజీ సహచరులు ధోనీతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. సీఎస్‌కే తరఫున ధోనీతో 12 సీజన్లు ఆడిన రవీంద్ర జడేజా "8 /7 ఎ అంటూ తన అభిమానాన్ని వ్యక్తం చేశాడు.

బ్రావో, దూబే భావోద్వేగ సందేశాలు..

మాజీ వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో తన మాజీ కెప్టెన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. "థ్యాంక్యూ స్కిప్పర్.. నీ వారసత్వం ఎప్పటికీ నిలిచిపోతుంది" అంటూ ధోనీని ఉద్దేశించి సందేశం ఇచ్చాడు.సీఎస్‌కే ఆల్‌రౌండర్ శివమ్ దూబే కూడా తన కెరీర్‌లో ధోనీ పాత్రను గుర్తుచేసుకున్నాడు. ధోనీ కెప్టెన్సీలో ఆడటం తన కల అని, సీఎస్‌కేలో ఎంపికైన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో తొలిసారి ధోనీని కలిసిన సందర్భం ఇప్పటికీ గుర్తుందని తెలిపాడు.



మ్యాచ్‌ల సమయంలో ధోనీ ఇచ్చిన సూచనలు తన కెరీర్‌ను మార్చాయని పేర్కొన్నాడు. ఇక మైదానంలో ధోనీతో కలిసి ఆడే అవకాశం లేకపోవడం బాధగా ఉందని చెప్పాడు.

చిన్ననాటి అభిమానుల నుంచి సహచరులుగా.

సాయి సుదర్శన్ తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నాడు. చెన్నైలో చిన్న పిల్లాడిగా స్టాండ్స్‌లో కూర్చొని ధోనీని చూసిన తాను, ఆ తర్వాత అతడితో కలిసి మైదానంలో ఆడే అవకాశం పొందడం ఎంతో ప్రత్యేకమని చెప్పాడు. ఒక తరం క్రికెటర్లకు ధోనీ స్ఫూర్తిగా నిలిచాడని, ఇకపై యువ ఆటగాళ్లకు అతడి మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.

దీపక్ చాహర్ కూడా తన కెరీర్‌లో ధోనీ అందించిన ప్రోత్సాహం, మద్దతును గుర్తుచే సుకున్నాడు. తనపై నమ్మకం ఉంచి అవకా శాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. ధోనీ ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం దక్కడం ంగా భావిస్తున్నట్లు పేర్కొన్నాడు.

తుషార్ దేశ్‌పాండే తన అనుభవాన్ని ప్రత్యేకంగా పంచుకున్నాడు. ఒకప్పుడు బాల్ బాయ్‌గా ధోనీని చూసిన తాను, ఆ తర్వాత అతడితో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం, ఐపీఎల్ టైటిల్ వేడుకల్లో భాగం కావడం జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని చెప్పాడు.

ఆపిల్ నుంచి అమెరికా భద్రతా సంస్థ వరకు.. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సేవలకు అంతరాయం!



ప్రపంచవ్యాప్తంగా పలు కీలక డిజిటల్ సేవలు సాంకేతిక అంతరాయాలను ఎదుర్కొన్నాయి. ఆపిల్‌కు చెందిన ఐక్లౌడ్, యాప్ స్టోర్, ఆపిల్ పే, ఆపిల్ మ్యూజిక్, ఆపిల్ సపోర్ట్ వంటి సేవలు నిలిచిపోవడంతో వేలాది మంది వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు అమెరికా జాతీయ భద్రతా సంస్థ (మీూా) అత్యంత రహస్య కమ్యూనికేషన్ల నెట్‌వర్క్‌లోనూ తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో 178 సంస్థల వెబ్‌సైట్లలో హానికరమైన జావాస్క్రిప్ట్ కోడ్ గుర్తించడం ప్రపంచవ్యాప్తంగా సైబర్ భద్రతపై ఆందోళనలు పెంచింది.

ఆపిల్ సేవల్లో భారీ అంతరాయం

ఆపిల్ అంతర్గత సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా తన పలు సేవల్లో అంతరాయాలు ఏర్పడినట్లు సంస్థ ధృవీకరించింది. ఈ ఘటన సైబర్‌దాడి వల్ల జరగలేదని స్పష్టం చేసింది. అంతర్గత అప్‌డేట్ అనంతరం చాలా వ్యవస్థలు తిరిగి పనిచేయడం ప్రారంభించాయని, మిగిలిన సేవలను కూడా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆపిల్ ప్రతినిధి తెలిపారు.

డౌన్‌డిటెక్టర్‌లో మంగళవారం (సవంబర్ 17) మధ్యాహ్నం తర్వాత ఫిర్యాదులు భారీగా పెరిగాయి. వినియోగదారులు ఖాతాల్లోకి లాగిన్ కావడం, ఐక్లౌడ్ సేవలను ఉపయోగించడం, కొత్త పరికరాలను యాక్టివేట్ చేయడంలో సమస్యలు ఎదుర్కొన్నారు. ఆపిల్ వాలెట్, ఆపిల్ మ్యూజిక్ సేవల్లోనూ కనెక్షన్ సమస్యలు నమోదయ్యాయి. అమెరికాతో పాటు బ్రెజిల్, గ్రీస్, లాట్వియా వంటి దేశాల్లోనూ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత ఆపిల్ మ్యూజిక్, యాప్ స్టోర్, ఆపిల్‌కేర్ సేవల్లో పూర్తి అంతరాయాలు ఉన్నట్లు సంస్థ అంగీకరించింది.

చీూా రహస్య నెట్‌వర్క్‌లోనూ అంతరాయం

అమెరికా జాతీయ భద్రతా సంస్థకు చెందిన చీూా నెట్‌లో మంగళవారం సాధారణ నిర్వహణ పనుల సందర్భంగా సాంకేతిక సమస్య తలెత్తింది. వర్గీకృత సమాచారాన్ని సురక్షితంగా మార్పిడి చేసుకునేందుకు ఉద్యోగులు ఉపయోగించే అంతర్గత కమ్యూనికేషన్ వ్యవస్థ తాత్కాలికంగా దెబ్బతిన్నట్లు ఓ అమెరికా అధికారి వెల్లడించారు. అయితే కీలక సామర్థ్యాలు పనిచేస్తున్నాయని, జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. అత్యవసరం కాని సిబ్బంది కార్యాలయానికి వచ్చే సమయాలను విడతలవారీగా కేటాయించారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

యంగ్ టాలెంట్‌తోనే ఇండస్ట్రీ కళకళలాడుతోంది.. మెగాస్టార్ చిరంజీవి..



టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో కొత్త దర్శకులు, యువ నటీనటులు తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పుల వల్లనే సినిమాలకు పూర్వవైభవం వస్తోందని మెగాస్టార్ చిరంజీవి అభిప్రాయపడ్డారు. తాజాగా విడుదలైన 'ఇట్లు అర్జున' సినిమా సక్సెస్ మీట్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, చిత్ర యూనిట్‌ను అభినందించడంతో పాటు నేటి ట్రెండ్, యువత ప్రతిభపై కీలక వ్యాఖ్యలు చేశారు. కింగ్ నాగార్జున సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో వైరలవుతున్నాయి. ఈ సందర్భంగా హీరో అనీష్ డెబ్యూకు లభించిన అపూర్వ మద్దతును ప్రత్యేకంగా ప్రస్తావించారు. "హీరో అనీష్... చాలా అదృష్టవంతుడివయ్యా నువ్వు. ఏ హీరోకి డెబ్యూటెంట్ ఫిలిం, ఒక కొత్త హీరోగా ఇంత మంది, ఇండస్ట్రీలో దాదాపుగా ఉన్నటువంటి హీరోస్ అందరూ ఏదో ఒక విధంగా సపోర్ట్ చేయటం అన్నది ఎవ్వరికీ దక్కలేదు. అది ఒక... అనీష్‌కే దక్కింది," అని చిరంజీవి వ్యాఖ్యానించారు. మాకెవ్వరికీ కూడా ఇలాంటి మద్దతు దక్కలేదని, నాగార్జున గారికి కూడా ఇంతటి మద్దతు దక్కుంటుందని తాను అనుకోవడం లేదని చిరంజీవి అన్నారు.అనీష్ చిన్నతనం నుంచే సినిమా షూటింగ్‌లు చూస్తూ సినిమా పట్ల మక్కువ పెంచుకున్నాడని, తాను కూడా నటుడు కావాలని సంకల్పించుకున్నాడని చిరంజీవి తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా, వారు ప్రోత్సహించారని పేర్కొన్నారు. "మా మహేష్ రెడ్డి అబ్బాయి అనేసరికి మాకు కూడా, యస్, ఇలాంటోడు రావాలి, ఇంత టాలెంట్ ఉండి, ఇంత ఇంట్రెస్ట్ ఉన్నందుకు మనం కూడా ఎంకరేజ్ చేయాలి అంటూ ప్రతి ఒక్కళ్ళు ఈ రోజున అతని వెనకాల నిలబడ్డారు," అని చిరంజీవి అన్నారు.ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన అనస్వర రాజన్ తన అభినయంతో, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో సినిమాకే హైలైట్‌గా నిలిచారని చిరంజీవి పేర్కొన్నారు. సినిమాలో ఆమె వేరియేషన్స్ , డ్యాన్స్ అద్భుతంగా ఉన్నాయని, తెలుగు చిత్ర పరిశ్రమలో ఆమెకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశీర్వదించారు. అలాగే ఈ సినిమాకు ప్రాణం పోసిన మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా విజయానికి ప్రధాన కారణమని కొనియాడారు. నిర్మాత వెంకీ కుడుముల ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం అభినందనీయమని చెప్పారు.

ఆ హీరో నా బెస్ట్ ఫ్రెండ్..



హీరో తరుణ్ సినీ కెరీర్ ఒక ఆసక్తికరమైన అధ్యాయం. బాలనటుడిగా, ఆ తర్వాత లవర్ బాయ్‌గా అద్భుతమైన విజయాలు సాధించి, ఒక దశలో స్టార్‌డమ్ అనుభవించిన తరుణ్, అకస్మాత్తుగా తెరమరుగవడం అనేక మందిని ఆశ్చర్యపరిచింది. ఈ అంశంపై నటుడు రాజీవ్ కనకాల ఇటీవల తన అభిప్రాయాలను వెల్లడించారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ తరుణ్ అద్భుతమైన నటుడని.. మంచి డాన్సర్, ఫైట్స్ కూడా బాగా చేయగల సమర్థుడు అని స్పష్టం చేశారు. రాజీవ్ తండ్రి దేవదాస్ కనకాల, తరుణ్ తండ్రి చక్రపాణి మంచి మిత్రులు కావడంతో, తరుణ్‌ను చిన్నతనం నుంచే చూశానని రాజీవ్ పేర్కొన్నారు. బాలనటుడిగా తరుణ్ ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించారని, ఆ తర్వాత ప్రియమైన నీకు, నువ్వే నువ్వే, నువ్వు లేక నేను లేను వంటి ప్రేమ కథా చిత్రాలతో హీరోగా ఎదిగి, లవర్ బాయ్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు. ఒక దశలో తరుణ్ డేట్స్ దొరకడం కష్టంగా ఉండేదని, 20-30 హిట్‌లను తన ఖాతాలో వేసుకున్నారని రాజీవ్ వివరించారు.అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, తరుణ్ కెరీర్ ఎందుకు మసకబారిందనే ప్రశ్నకు రాజీవ్ కనకాల కొన్ని కారణాలను ఊహించారు. బహుశా, కథల ఎంపికలో కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకొని ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వ్యక్తిగత నిర్ణయాలు కూడా దీనికి దోహదపడి ఉండవచ్చని సూచించారు. పరిశ్రమలో "టైం" అనేది చాలా ముఖ్యమని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాజీవ్ అన్నారు. కొన్నిసార్లు నెమ్మదిగా మంచి ప్రాజెక్ట్ కోసం ఎదురు చూసే క్రమంలో, వేరొకరు ఆ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు."అగ్రెసివ్‌గా వెళ్ళాలి" అనే సూత్రాన్ని తరుణ్ పాటించలేదేమో అని రాజీవ్ కనకాల అభిప్రాయపడ్డారు. తరుణ్ చాలా మంచివాడు, నెమ్మదస్తుడు కావడంతో, ప్రస్తుత సినిమా పరిశ్రమ వేగానికి అతను సరిపోలేదేమో అని ఆయన అన్నారు. ఒక వయసు వచ్చిన తర్వాత సరైన మార్గదర్శకులు ఉండటం కూడా ముఖ్యమని, తరుణ్ తండ్రాయన జడ్జిమెంట్ తప్పు అయ్యుండొచ్చని రాజీవ్ కనకాల పేర్కొన్నారు. తరుణ్ ఇప్పటికీ గొప్ప నటుడని, మంచి కంబ్యాక్ సినిమా పడితే, అతను ఖచ్చితంగా తిరిగి వస్తాడని రాజీవ్ కనకాల విశ్వాసం వ్యక్తం చేశారు. ఒకప్పుడు యూత్, కుటుంబాలు, ముఖ్యంగా అమ్మాయిలలో తరుణ్‌కు ఉన్న క్రేజ్ అపారమని గుర్తు చేశారు. తరుణ్ తిరిగి రావాలని తాను కోరుకుంటున్నానని, అతని ప్రతిభకు తగ్గ గుర్తింపు మళ్లీ లభించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

నా భార్య ఎప్పుడూ నా పక్కన నడవదు..



టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ఒకప్పుడు లవర్ బాయ్‌గా, ఆ తర్వాత స్టార్ హీరోగా వెలుగొందిన జగపతి బాబు ప్రస్తుతం వైవిధ్యమైన పాత్రలతో విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అద్భుతమైన విజయాలను అందుకుంటున్నారు. అయితే ఆయన వృత్తిపరంగా ఎంతటి ఉన్నత స్థితిని చూశారో, వ్యక్తిగత జీవితంలోనూ అన్నింటికంటే కఠినమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు.తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన జీవితంలోని క్లిష్ట పరిస్థితులు, ఎదురైన ఇబ్బందులు, తన కుటుంబం ముఖ్యంగా తన భార్య తన జీవితంలో పోషించిన కీలక పాత్ర గురించి తొలిసారిగా చాలా విషయాలను పంచుకున్నారు. తన కెరీర్‌లో ఊహించని విధంగా ఎదురుదెబ్బలు తగిలినప్పుడు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడ్డానని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో పరిస్థితులు ఎంత తీవ్రంగా మారాయంటే ఏకంగా తమ ఇంటిని సైతం విక్రయించాల్సి వచ్చిందని తెలిపారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన జీవితంలోని క్లిష్ట పరిస్థితులు, ఎదురైన ఇబ్బందులు, తన కుటుంబం ముఖ్యంగా తన భార్య తన జీవితంలో పోషించిన కీలక పాత్ర గురించి తొలిసారిగా చాలా విషయాలను పంచుకున్నారు. తన కెరీర్‌లో ఊహించని విధంగా ఎదురుదెబ్బలు తగిలినప్పుడు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడ్డానని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో పరిస్థితులు ఎంత తీవ్రంగా మారాయంటే ఏకంగా తమ ఇంటిని సైతం విక్రయించాల్సి వచ్చిందని తెలిపారు.ఇల్లు అమ్మినప్పటికీ అప్పట్లో ఇంకా మూడు కోట్ల రూపాయల అప్పు మిగిలిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'లెజెండ్' సినిమా షూటింగ్ నిమిత్తం తాను వైజాగ్‌లో ఉన్న సమయంలో తన కుటుంబం ఇల్లు ఖాళీ చేసిందని, ఆ సమయంలో తాను వారి దగ్గర లేకపోవడం వల్ల తన భార్య, పిల్లలు ఎంతటి మానసిక వేదనను అనుభవించారో తలుచుకుంటే ఇప్పటికీ బాధనిపిస్తుందని ఎమోషనల్ అయ్యారు.ఇల్లు అమ్మినప్పటికీ అప్పట్లో ఇంకా మూడు కోట్ల రూపాయల అప్పు మిగిలిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'లెజెండ్' సినిమా షూటింగ్ నిమిత్తం తాను వైజాగ్‌లో ఉన్న సమయంలో తన కుటుంబం ఇల్లు ఖాళీ చేసిందని, ఆ సమయంలో తాను వారి దగ్గర లేకపోవడం వల్ల తన భార్య, పిల్లలు ఎంతటి మానసిక వేదనను అనుభవించారో తలుచుకుంటే ఇప్పటికీ బాధనిపిస్తుందని ఎమోషనల్ అయ్యారు.తన కష్టకాలంలో భార్య, పిల్లలు ఏనాడూ తనను నిందించలేదని, తన గైర్హాజరీ గురించి ప్రస్తావించి ఇబ్బంది పెట్టలేదని జగపతిబాబు ప్రశంసించారు. 'అంతఃపురం' సినిమా డబ్బింగ్ సమయంలో తన చిన్న కుమార్తెకు తీవ్రమైన ఆరోగ్య సమస్య వస్తే, తన భార్య ఒంటరిగా ధైర్యంగా నిలబడి ఆ పరిస్థితిని ఎదుర్కొన్న తీరు తనను ఎంతగానో కదిలించిందన్నారు. తన భార్య లేకపోతే తాను లేనని, ఆమెకు ఎప్పటికీ రుణపడి ఉంటానని జగపతి బాబువల్ల లైమ్‌లైట్‌కు, పబ్లిసిటీకి పూర్తిగా దూరంగా ఉంటారని తెలిపారు. అందుకే తాము ఎక్కడికైనా వెళ్లినప్పుడు తన పక్కన కాకుండా ముందు లేదా వెనుక నడుస్తారని, వారి వ్యక్తిగత జీవితానికి వారు ఎంతో గౌరవం ఇస్తారని ఆయన స్పష్టం చేశారు. కుటుంబం అందించిన అండదండలు, ఆత్మస్థైర్యమే తనను ఈరోజు ఈ స్థాయిలో నిలబెట్టాయని జగపతిబాబు చెప్పిన మాటలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.తన కుటుంబ సభ్యులు సినీ నేపథ్యం ఉన్నవారు కాకపోవడం వల్ల లైమ్‌లైట్‌కు, పబ్లిసిటీకి పూర్తిగా దూరంగా ఉంటారని తెలిపారు. అందుకే తాము ఎక్కడికైనా వెళ్లినప్పుడు తన పక్కన కాకుండా ముందు లేదా వెనుక నడుస్తారని, వారి వ్యక్తిగత జీవితానికి వారు ఎంతో గౌరవం ఇస్తారని ఆయన స్పష్టం చేశారు. కుటుంబం అందించిన అండదండలు, ఆత్మస్థైర్యమే తనను ఈరోజు ఈ స్థాయిలో నిలబెట్టాయని జగపతిబాబు చెప్పిన మాటలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

దిల్ మూవీతో వచ్చిన ప్రాఫిట్ అంతా తరుణ్ సినిమాతో పోయింది



ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన సినీ ప్రస్థానంలోని ఒడిదుడుకులను, ముఖ్యంగా తన మొదటి బ్లాక్‌బస్టర్ దిల్ సినిమా విజయం, ఆ లాభాన్ని హీరో తరుణ్ నటించిన నిన్నే ఇష్టపడ్డాను చిత్రం ఎలా హరించివేసిందో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తొలినాళ్లలో దిల్ రాజు డిస్ట్రిబ్యూటర్‌గా మూడు వరుస ప్లాపులు చవిచూశారు. దీనివల్ల పరిశ్రమలో చేయి మంచిది కాదు అనే సెంటిమెంట్‌తో ఆయనను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ దశలో ఆయన దిల్ సినిమా నిజాం హక్కులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారు. ఆరు లక్షల రూపాయలు చెల్లించి, మొత్తం 60 లక్షల రూపాయల డీల్‌ను పూర్తి చేయడానికి చాలా మంది ఆఫీసుల చుట్టూ తిరిగారు. అయితే ఆయన గత రికార్డు, సినిమా కాన్సెప్ట్‌రంగంగా ఎవరూ పెట్టుబడి పెట్టడానికి ముందుకు రాలేదు. ఇలాంటి సమయంలో, సినీ దిగ్గజం ఎం.ఎస్. రెడ్డి (తలంబాలు, ఆపుతి, అంకుశం వంటి చిత్రాల నిర్మాత) ఒక మీడియేటర్ ద్వారా దిల్ రాజును సంప్రదించారు. ఎం.ఎస్. రెడ్డి భాగస్వామ్యం అడగడం దిల్ రాజుకు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది. హైదరాబాద్‌లో జరిగిన చర్చల అనంతరం, ఎం.ఎస్. రెడ్డి దిల్ సినిమాలో 50% వాటా తీసుకునేందుకు అంగీకరించారు. దిల్ రాజు చెల్లించిన ఆరు లక్షల రూపాయలకు అదనంగా, ఎం.ఎస్. రెడ్డి మరో ఆరు లక్షలు చెల్లించి, వారి భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దిల్ రాజుతో కలిసి చెన్నై వెళ్లి, సుబ్రమణ్యేశ్వర ఫిలిమ్స్ పేరు మీద అగ్రిమెంట్‌ను పూర్తి చేయించారు.దిల్ చిత్రం



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హాలీవుడ్ చిత్రం 'అవెంజర్స్: డూమ్స్‌డే' . ఇంతకుముందెన్నడూ ఏ హాలీవుడ్ చిత్రంలోనూ కనిపించని ఎందరో ప్రముఖ నటీనటులు ఈ సినిమా కోసం ఒకచోట చేరారు. ఈ చిత్రంలో 30 మందికి పైగా తారలు నటించడం విశేషం. 'ఐరన్ మ్యాన్'గా మెరిసిన రాబర్ట్ డౌనీ జూనియర్, ఈ చిత్రంలో ప్రధాన ప్రతినాయకుడి పాత్రలో నటించారు. ఈ సినిమాపై ఇంతటి హైప్‌కు ఇది కూడా ఒక ప్రధాన కారణం. ఇప్పుడు ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం కాగా, 'అవెంజర్స్: డూమ్స్‌డే' చిత్రం భారతదేశంలో మొదటి రోజే మంచి ఘనమైన ప్రారంభాన్ని అందుకుంది. భారతదేశంలో ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్‌లు మంగళవారం (నవంబర్ 17) ప్రారంభమయ్యాయి. ప్రారంభమైన కొన్ని గంటల్లోనే, బుక్‌మైషో ద్వారా 50,000కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. దేశవ్యాప్తంగా కేవలం 500 స్క్రీనింగ్‌లలోనే 'అవెంజర్స్: డూమ్స్‌డే' ఇప్పటికే 50,000కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఈ అమ్మకాలలో అధికభాగం పీవీఆర్, ఇనాక్స్‌లలో జరిగాయి. సింగిల్-స్క్రీన్ లేదా ప్రైవేట్‌గా నడిచే మల్టీప్లెక్స్‌లలో అడ్వాన్స్ బుకింగ్‌లు ఇంకా ప్రారంభం కాలేదు.'అవెంజర్స్: డూమ్స్‌డే ఈ సినిమాపై ఉన్న క్రేజ్ ఎంత ఎక్కువగా ఉందంటే, అడ్వాన్స్ బుకింగ్ కారణంగా మొదటి రోజు షోలన్నీ హౌస్‌ఫుల్ అయ్యే బలమైన అవకాశం ఉంది. అంతేకాకుండా, మొదటి రోజు షో టిక్కెట్లు ఈ వారంలోనే ముందుగానే బుక్ అయిపోతాయి. విశేషమేమిటంటే, ముంబై, కేరళలోని అనేక ప్రదేశాలలో 'అవెంజర్స్: డూమ్స్‌డే' సినిమా షోలు అర్ధరాత్రి ప్రారంభమవుతాయి. ఇక్కడ అర్ధరాత్రి 12 గంటలకే ఒక స్పెషల్ షోను ప్రదర్శిస్తున్నారు. ఇక ఉత్తర భారతదేశంలోని అనేక నగరాల్లో ఈ షోను ఉదయం 6 గంటలకు ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్‌లు కేవలం రెగ్యులర్ మల్టీప్లెక్స్ థియేటర్లలో మాత్రమే ప్రారంభమయ్యాయి. ఐమాక్స్, 4డిఎక్స్, డాల్బీ వంటి ప్రీమియం ఫార్మాట్‌ల టిక్కెట్లు ఇంకా అమ్మకానికి రాలేదు. ముందుగా రెగ్యులర్ స్క్రీన్‌లను నింపి, ఆ తర్వాత ప్రీమియం ఫార్మాట్‌లకు బుకింగ్‌లు ప్రారంభించాలన్నది ప్రణాళిక. అయితే, ఇది అవెంజర్స్ సినిమా కాబట్టి, ఏ స్క్రీన్ తెరిచినా అది నిండిపోతుందని అంటున్నారు. 'అవెంజర్స్: డూమ్స్‌డే' సరిగ్గా నేటి నుండి ఒక నెల తర్వాత, అంటే డిసెంబర్ 17న భారతదేశంలో విడుదల కానుంది. ఇది మరుసటి రోజు, అంటే డిసెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతుంది.

అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే రచ్చ రేపుతోన్న 'అవెంజర్స్ డూమ్స్‌డే'..

అప్పుడు లావుగా ఉన్నా అన్నారు.. ఇప్పుడు చిక్కిపోయా అంటున్నారు



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు అందం ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే వెండితెరపై కనిపించే నటీమణుల రూపం, శరీరాకృతిపై సోషల్ మీడియాలో తరచూ విమర్శలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా కొందరు హీరోయిన్లు కాస్త బరువు పెరిగినా, బరువు తగ్గినా నెటిజన్లు ట్రోలింగ్ చేయడం కామన్‌గా మారిపోయింది. ఇలాంటి విమర్శలను కొందరు లైట్ తీసుకుంటే.. మరికొందరు మాత్రం వాటి కారణంగా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఇదే విషయంపై ఓ హీరోయిన్ చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.ఆమె మరెవరో కాదు.. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మరాఠీ నటి శ్రుతి మరాఠే. ఈ సినిమాలో ఎన్టీఆర్ భార్య పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించుకుంది. దేవర సినిమా విడుదలైన తర్వాత శ్రుతి మరాఠే గురించి నెటిజన్లు సోషల్ మీడియాలో తెగ వెతికారు. దీంతో ఆమెకు సంబంధించిన ఫొటోలు, వ్యక్తిగత విషయాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి.ఆమె మరెవరో కాదు.. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మరాఠీ నటి శ్రుతి మరాఠే. ఈ సినిమాలో ఎన్టీఆర్ భార్య పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించుకుంది. దేవర సినిమా విడుదలైన తర్వాత శ్రుతి మరాఠే గురించి నెటిజన్లు సోషల్ మీడియాలో తెగ వెతికారు. దీంతో ఆమెకు సంబంధించిన ఫొటోలు, వ్యక్తిగత విషయాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి.అయితే శ్రుతి మరాఠే గతంలో తన శరీరాకృతిపై ఎదురైన విమర్శల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ముఖ్యంగా తన బరువును టార్గెట్ చేస్తూ చాలామంది కామెంట్స్ చేసేవారని చెప్పుకొచ్చింది. కొన్నేళ్ల పాటు ఇలాంటి విమర్శలు ఎదుర్కోవడంతో మానసికంగా ఎంతో ఒత్తిడికి గురయ్యానని తెలిపింది. ఆ మాటలు తనపై తీవ్ర ప్రభావం చూపించాయని, చివరకు

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224